Follow: @ANNTELUGU

ANN తెలుగు

29-09-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 295 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


## మానేపల్లి జ్యూయలర్స్‌కు టైమ్స్ బిజినెస్ అవార్డు

**బ్రైడల్ జ్యూయలరీలో ప్రతిష్టాత్మక బ్రాండ్ గా ప్రజాదరణ**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేతులమీదుగా అవార్డు**




**హైదరాబాద్, మహా:** ప్రముఖ మానేపల్లి జ్యూయలర్స్‌కి అరుదైన గౌరవం దక్కింది. మానేపల్లి జ్యూయలర్స్‌కి టైమ్స్ బిజినెస్ అవార్డు దక్కింది. అలాగే బ్రైడల్ జ్యూవెలరీలో అత్యంత ప్రజాదరణ పొందిన బ్రాండ్‌గా చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా యాజమాన్యం ఆ అవార్డును అందుకుంది. తమ ప్రయాణంలో మరో మైలురాయిని సాధించామని మానేపల్లి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ అవార్డు ఇచ్చిన టైమ్స్ బిజినెస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొంది. కస్టమర్లు తమ ఉంచిన విశ్వాసానికి ఇదే నిజమైన నిదర్శనమని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో మానేపల్లి ఆభరణాలకు స్పెషల్ క్రేజ్ ఉంది. కస్టమర్ల ఆదరణ చూరగొనడంలో తిరుగులేని ట్రాక్ రికార్డు ఉంది.

**టాప్ న్యూస్**

### ఇదీ సీవీ ఆనంద్ ట్రాక్ రికార్డు

- హైదరాబాద్ సీపీగా సూపర్ సక్సెస్
- అనుభవాలతో ట్వీట్ .. దేశంలోనే బెస్ట్



02

### వోకల్ ఫర్ లోకల్..

- అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి
- స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి ప్రజలు పెద్దపీట వేయాలి
- మన్‌కీ బాత్ 126వ ఎపిసోడ్ లో ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ



02

### ప్రభాస్‌కు ఫాదర్‌గా మెగాస్టార్

- సందీప్ వంగా బిగ్గెస్ట్ మల్టీస్టారర్
- యానిమల్ రేంజ్ లో ప్లాన్



02






# పదేళ్ళు అవకాశం ఇవ్వండి

## ప్రపంచాన్ని ఇక్కడకు రప్పిస్తా..

### న్యూయార్క్‌తో పోటీపడే ఫ్యూచర్ సిటీ నిర్మిస్తా..

ఫ్యూచర్ సిటీ శంఖుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### నాలుగు నెలల్లోఎఫ్‌సీడీఏ భవనం రెడీ

పదెకరాల్లో సింగరేణి భవన్ .. ఏడాదిలోగా నిర్మాణం పూర్తియాలని ఆదేశాలు

రావిర్యాల.. ఆమన్‌గల్ మధ్య రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ కు భూమిపూజ

**హైదరాబాద్, మహా :** ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని, చరిత్రలోనే ఈ సిటీ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ కార్యాచరణకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. 15 వేల చదరపు అడుగుల్లో రూ.20 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నాలుగు నెలల్లో ఈ నిర్మాణం పూర్తి కానుంది. అనంతరం ఫ్యూచర్ సిటీలో జరిగే అభివృద్ధి పనులు, పరిశ్రమలు, లే అవుట్లలకు ఎఫ్‌సీడీఏ అధికారులు అనుమతులు ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఉన్నారు. రావిర్యాలఆమన్‌గల్ మధ్య రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ 1కు సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీకి కేంద్ర బిందువుగా నిలిచే డెవలప్ మెంట్ భవనాన్ని డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని, అదే సమయంలో స్కిల్ యూనివర్సిటీని సైతం పూర్తి చేస్తామని సీఎం కీలక ప్రకటన చేశారు. ఎఫ్‌సీడీఏ పూర్తి కాగానే అప్పుడు నెలకు మూడుసార్లు ఇక్కడికే వచ్చి ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. ప్రపంచంలో ఎవరు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడుతానని తెలిపారు. తనకు పదేళ్ళ సమయం ఇవ్వాలని, ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తానని అన్నారు.

మిగతా 2లో




## భారత్ జయభేరి..

**తెలుగోడి దెబ్బ అదుర్స్.. పాక్ చిత్తు చిత్తు**

- ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్ పై విజయఢంకా
- 9వ సారి ఆసియా కప్ విన్నర్ గా టీమ్ ఇండియా
- హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ సూపర్ ఇన్నింగ్స్
- నాలుగు వికెట్లతో పాక్‌ను దెబ్బతీసిన స్పిన్నర్ కుల్దీప్
- భారత్ విజయంపై దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువ

03



## అండమాన్‌లో చమురు సముద్రం

**2 లక్షల కోట్ల లీటర్ల చమురు నిల్వలు**

**భారత్‌కు గుడ్ న్యూస్.. నిర్ధారించిన కేంద్రమంత్రి**

**ఢిల్లీ, మహా :** భారతదేశ ఇంధన రంగానికి ఒక భారీ శుభవార్త. అండమాన్ బేసిన్‌లో భారీ మొత్తంలో సహజ వాయువు నిక్షేపాలను కనుగొన్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. ఈ ఆవిష్కరణతో అండమాన్ సముద్రంలో శక్తి అవకాశాల మహాసముద్రం తెరుచుకుందని కేంద్రమంత్రి అభివర్ణించారు. ఈ సందర్భంగా అండమాన్ సముద్రంలో ప్రాథమికంగా నిర్వహించిన పరీక్షల్లో ఈ సహజ వాయువు నిల్వలు ఉన్నట్లు తేలిందని హర్దీప్ సింగ్ పూరీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మిగతా 2లో

### స్థానికానికి సర్వం సిద్ధం

- మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు
- రెండు దశల్లో ఎంపీటీసీ/ జడ్పీటీసీ పోలింగ్

వివరాలు 2లో



03

### సోలార్ పవర్ విలేజ్‌గా సీఎం రేవంత్ స్వగ్రామం

**దక్షిణ భారతదేశంలోనే మొదటి గ్రామంగా గుర్తింపు**

రూ 10.53 కోట్లతో 514 ఇండ్లతో పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టు

### గ్రూప్-2 ఫలితాలు వచ్చేశాయ్..

- ఫలితాలను విడుదల చేసిన టీజీపీఎస్సీ చైర్మన్
- 782 పోస్టుల ఫలితాలు రిలీజ్.. కోర్టు కేసు కారణంగా హోల్ట్ లో ఒక పోస్ట్
- దసరా లోపు నియామక పత్రాలు అందించాలని భావిస్తున్న కమిషన్

02








### పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- కంది శ్రీనివాస రెడ్డి
- డాల్డా కంపెనీ కాలనీలో భారీ చేరికలు
- కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేరిన కాలనీ వాసులు
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి
- మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపు

06




# ఇదీ సీవీ ఆనంద్ ట్రాక్ రికార్డు

## హైదరాబాద్ సీపీగా సూపర్ సక్సెస్.. అనుభవాలతో ట్వీట్ .. దేశంలోనే బెస్ట్

**హైదరాబాద్ సిటీ, మహా :**

హైదరాబాద్ సిటీ సీపీగా సీవీ ఆనంద్ సూపర్ సక్సెస్ అయ్యారు. సిటీలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ లో మిస్టర్ పర్ ఫెక్ట్ అని ప్రూఫ్ చేసుకున్నారు. హైదరాబాద్ నగర సీపీగా రెండోసారి సీవీ ఆనంద్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సెప్టెంబర్ 2024 నుండి ఆగస్టు 2025 వరకు ఈ 12 నెలంలో భారీగా నేరాలు తగ్గినట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పనితీరును క్రైమ్ వింగ్ సమీక్షలో తేలింది. ఈ విషయాన్ని సీవీ ఆనంద్ తన ఎక్స్ ఖాతా ద్వారా స్వయంగా వెల్లడించారు. మొత్తం క్రైమ్ 22 శాతం తగ్గిందని తెలియజేయడానికి సంతోషంగా ఉందని ఎక్స్ లో పేర్కొన్నారు. నేరస్థులను గుర్తించడంతో పాటు అరెస్టులు చేయడం, నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు చేశామని, కోర్టుల్లో తీర్పులు తీసుకురావడం, రౌడీ గ్యాంగ్స్‌పై నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ క్రైమ్ వంటి అన్ని విభాగాలలో పోలీస్ బలగాలు సత్వర స్పందనలతో ఇది సాధ్యమైందని సీవీ ఆనంద్ చెప్పారు. హైదరాబాద్ నగరంలో నైట్ పెట్రోలింగ్ దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.. హైదరాబాద్ సిటీ పోలీస్ 2.0 పునర్వ్యవస్థీకరణ అనంతరం ప్రస్తుతం 134 పెట్రోలింగ్ కార్లు 222 బ్లూ కోల్ట్స్ విధుల్లో ఉన్నాయని.. వీటి వల్ల రాత్రి నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. అన్ని



పండుగలను శాంతియుతంగా, ఎంత సున్నితమైన సందర్భాలు ఉన్నా సాఫీగా నిర్వహించడం, ఈ ఏడాది లా అండ్ ఆర్డర్ పరంగా విజయవంతమైన సంవత్సరంగా చెప్పవచ్చని పేర్కొన్నారు.

**క్రైమ్ రివ్యూ (సెప్టెంబర్ 2023–ఆగస్టు**

**2024 vs సెప్టెంబర్ 2024–ఆగస్టు 2025):**

**భౌతిక దాడులు: 3,451- 2,911 (15.6% తగ్గింది)**

**మహిళలపై నేరాలు: 3,250–2,891 (11.6% తగ్గింది)**

**ఆస్తి నేరాలు: 5,484 –4,082 (26% తగ్గింది)**

**రికవరీ రేటు: 54% – 55% (పెరిగింది)**

**సైబర్ నేరాలు: 4,348 – 3,745 (14% తగ్గింది)**

**డిటెక్షన్ రేటు: 40% – 42% (పెరిగింది)**

# పదేళ్ళు అవకాశం ఇవ్వండి



**(మొదటిపేజీ తరువాయి)**

న్యూయార్క్ తో పోటీపడే అద్భుత నగరం నిర్మిస్తానన్నారు. సింగరేణి కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఇక్కడే పది ఎకరాలు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులకు సూచన చేస్తున్నానంటూ, 2026 డిసెంబర్ లోగా ఆ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలన్నారు. మంచి సంకల్పంతో తలపెట్టిన ఈ భారత్ ఫ్యూచర్ సిటీ ప్రారంభోత్సవానికి వరుణదేవుడు కూడా సహకరించాడన్నారు. చాలా మంది కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని, నోటికొచ్చింది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక్కడ నాకేదో భూములు ఉన్నాయని, అందుకే ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారంటూ, ఇది నా కోసమో, నా కుటుంబం కోసమో కాదు, భవిష్యత్ తరాల భవిష్యత్తు కోసమన్నారు. నాడు కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరానికి అంకురార్పణ చేశారు, నిజాం కాలంలో సికింద్రాబాద్ ను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ అభివృద్ధి జరిగిందన్నారు. గతం నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉందని, మన భవిష్యత్ తరాల కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ నగరాలు భారత్ ఫ్యూచర్ సిటీ గురించి చర్చించుకునేలా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఒక గొప్ప నగరాన్ని నిర్మించడానికి ఉండాల్సిన అర్హతలన్నీ భారత్ ఫ్యూచర్ సిటీకి ఉన్నాయని, దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని పేర్కొన్నారు.

**గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రైపోర్ట్**

ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నామని, ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని సీఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయబోతున్నామని, రాబో యే పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే మా లక్ష్యమన్నారు. ఇందుకు మీ అందరి సహకారం ఉండాలన్నారు. చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరించుకుందామని, .ప్రభుత్వం ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని స్థానికులను ఉద్దేశించి అన్నారు. ముందుతరాల కోసం చంద్రబాబు, వైఎస్సార్ ఆలోచించారని నొక్కిచెప్పారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ ఆర్ వచ్చాయని గుర్తుచేశారు. గతం నుంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఓ మంచి ఆలోచనతో ఈ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పుకొచ్చారు. ఇంకెన్నాళ్లు విదేశాల గురించి మాట్లాడుకుంటాం..? అని ప్రశ్నించారు. పదేళ్ల సమయం ఇవ్వండి.. న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దని కోరారు. తక్షణమే మీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నానని, అందరికీ న్యాయం చేయాలనేదే మా ప్రయత్నమని పునరుద్ఘాటించారు.

**భవిష్యత్తు అంతా ఫ్యూచర్ ఈ సిటీలోనే : డిప్యూటీ సీఎం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఐటీ, ఫార్మా, వ్యవసాయ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, అంతర్జాతీ య స్టేడియం వంటి వాటితో అద్భుతమైన నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగబోతోందని, భవిష్యత్తు అంతా ఇక్కడే ఉందన్నారు. ఈ దేశ భవిష్యత్తు అంతా ఈ ఫ్యూచర్ సిటీ చుట్టే తిరగబోతుందేమో అన్న భావన తనకు కలిగిందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ లతో అద్భుతమైన రోడ్లు, మధ్యన మెట్రో రైలు దేశం లోని ఏ నగరానికి ఈ వ్యవస్థ లేదన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రోడ్డు వేయడం, ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కలుపుతూ బందర్ పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర మంత్రితో మాట్లాడి మంజూరు చేయించుకున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూరుకు రోడ్డు ఈ పనులన్నీ చూస్తుంటే ఇది ఒక మహా అద్భుతంగా మారే నగరంగా రూపు దిద్దుకోబోతుందన్నారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అని దీన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని నిన్న సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి తెల్లవారుజామునే భవిష్యత్తు నగరానికి శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

**లివ్ - లెర్న్- వర్క్ - ప్లే కాన్సెప్ట్ ఫ్యూచర్ సిటీ : మంత్రి శ్రీధర్**

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూసేలా ప్రపంచంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్ గా నిలిచేలా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇప్పుడు ప్రణాళికాబద్ధమైన నగరం అనగానే అందరికీ చండీఘర్ గుర్తుకొస్తుందని, రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధమైన నగరం అంటే 'భారత్ ఫ్యూచర్ సిటీ' గుర్తుకొస్తుందన్నారు. 'లివ్ – లెర్న్ – వర్క్ – ప్లే' అనే కాన్సెప్ట్ తో పరిశ్రమలు, ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్ అన్ని ఒకే చోట ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేయబోతున్నామని వివరించారు. భావి తరాల కోసం, మన బిడ్డల కోసం, వారి బంగారు భవిష్యత్తు కోసం ఈ రోజు మనం ద రం కలిసి వేస్తున్న పునాదే ఈ భారత్ ఫ్యూచర్ సిటీ అని, ఇది 'నెట్ జీరో కార్బన్ సిటీ' అని పేర్కొన్నారు. ఇక్కడ పచ్చదనం ఉంటుంది, కాలుష్యం ఉండదు. పరిశ్రమలు వస్తాయి, కానీ పర్యావ రణానికి ఎలాంటి హాని జరగదన్నారు. రేపటి తరాల కోసం, తెలంగాణ కోసం చిత్తశుద్ధితో నిరంతరం కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వంతో కలిసి నడవాలని విజ్ఞప్తి చేశారు.

# వోకల్ ఫర్ లోకల్..

## అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి

### స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి ప్రజలు పెద్దపీట వేయాలి

### మన్‌కీ బాత్ 126వ ఎపిసోడ్ లో ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ



**ఢిల్లీ, మహా:** వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ.. గత 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్ద పీట వేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు.

**సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నాం..**

భారత నావికాదళానికి చెందిన ఇద్దరు అధికారిణులు, లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపల ధైర్య సాహసాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. సముద్ర గర్భంలో వారు చూపుతున్న తెగువను కొనియాడారు. భారత పుత్రికలు కఠినమైన పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. మన్‌కీ బాత్‌లో భాగంగా వారిరువురితో ఫోన్‌లో సంభాషించారు. స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్, భారతరత్న, ప్రముఖ గాయని లతా మంగేష్కర్‌ల జయంతి సందర్భంగా ప్రధాని మోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని..దానికి ముందు ఆయన ఆంగ్లేయులకు లేఖ రాశారని అన్నారు. ఇందులో తమను ఉరి కంబాలకు బదులు తూటాలతో చంపాలని భగత్‌సింగ్ కోరినట్లు తెలిపారు. ఆ లేఖ ఆయన సాహసానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భగత్ సింగ్ ఎప్పుడూ ముందుండేవారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. భారతీయ సంస్కృతి, సంగీతంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఆమె పాటలను విని మంత్రముగ్ధులైపోతారని కొనియాడారు.

# ప్రభాస్‌కు ఫాదర్‌గా మెగాస్టార్

## సందీప్ వంగా బిగ్గెస్ట్ మల్టీస్టారర్.. యానిమల్ రేంజ్‌లో ప్లాన్



**మహా :** సందీప్ వంగా బిగ్గెస్ట్ మల్టీస్టారర్ ప్లాన్ చేసినట్లు ఫిల్మ్ సర్కిల్స్ లో వినబడుతోంది. వంగా ప్లాన్ కు చిరంజీవి కూడా ఫ్లాట్ అయినట్లు తెలుస్తోంది. శ్రీకాంత్ అడ్డాలో దర్శకత్వంలో వచ్చిన సీతమ్మవాకిట్లో సినిమా నుంచి మల్టీస్టారర్ ట్రెండ్ మొదలైంది. ఇటీవల ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి నటించిన ట్రిపుల్ ఆర్ సినిమా ప్రపంచవ్యాప్తంగా సెన్షేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు ఏకంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో మెగాస్టార్ చిరంజీవి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు అంటే ఇది బిగ్గెస్ట్ మల్టీస్టారర్ సినిమా అని చెప్పాలి. యానిమల్ సినిమా చూసినప్పుడు తండ్రి క్యారెక్టర్ ను సందీప్ డిజైన్ చేసిన విధానం చాలామందికి విపరీతంగా కనెక్ట్ అయింది. కొంతమంది ఇదే సినిమా రామ్ చరణ్ మెగాస్టార్ చిరంజీవితో తీసి ఉంటే ఎలా ఉంటుందో అని ఎడిట్స్ కూడా చేశారు. రామ్ చరణ్ కి తండ్రిగా కాకపోయినా ప్రభాస్ కి మాత్రం తండ్రిగా మెగాస్టార్ ని సెట్ చేశాడు వంగా అనేవార్త ఫిల్మ్ సర్కిల్స్ లో వినబడుతోంది. అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ రావాల్సి ఉంది. సందీప్ వంగా చిరంజీవికి బిగ్ ఫ్యాన్ అన్న విషయం విదితమే.

# గ్రూప్-2 ఫలితాలు వచ్చేశాయ్..

## ఫలితాలను విడుదల చేసిన టీజీపీఎస్సీ చైర్మన్

### 782 పోస్టుల ఫలితాలు రిలీజ్.. కోర్టు కేసు కారణంగా హోల్డ్ లో ఒక పోస్ట్

### దసరా లోపు నియామక పత్రాలు అందించాలని భావిస్తున్న కమిషన్

**హైదరాబాద్, మహా:** గ్రూప్ 2 ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడించింది. మొత్తం 783 పోస్టులకు.. 782 మంది లిస్ట్ విడుదల చేసింది. ఒక్క పోస్ట్ ఫలితాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. 2022లో గ్రూప్ 2 నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. 2024 డిసెంబర్‌లో రాత పరీక్ష జరిగింది. కోర్టు ఆదేశాల అమలుపై ఈ ఎంపికలో ఏవైనా మార్పులు జరిగితే, అదే తదుపరిగా ఉంటుందని టీజీపీఎస్సీ తాజాగా స్పష్టం చేసింది. ఎవరైనా అభ్యర్థి తప్పుడు సమాచారాన్ని అందించారని లేదా ఏదైనా తప్పిదం కారణంగా పోస్ట్‌కు ఎంపికయ్యారని కమిషన్ దృష్టికి వస్తే వారిని ఎంపికకు సంబంధించి ఏ దశలోనైనా రద్దు చేయవచ్చని పేర్కొంది. నిబంధనల ప్రకారం, ఏదైనా చర్య తీసుకునే హక్కు కమిషన్‌కు ఉందని వెల్లడించింది.

**దసరా లోపు నియామక పత్రాలు?**

దసరా పండుగలోపే గ్రూప్ 2 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్రూప్ 2 సర్వీసులకు సంబంధించి 18 కేటగిరీల్లో 783 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ ఇచ్చింది. 5 లక్షలమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు మూడుసార్లు పరీక్షలు వాయిదా పడ్డాయి. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో .. మొత్తం 1368 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. 2 లక్షల మందికిపైగా అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మార్చిలో ప్రాథమిక ఫలితాల తర్వాత డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెరిట్ ఆధారంగా ఫైనల్ లిస్టు తయారు చేసి.. తాజాగా విడుదల చేశారు.






# అండమాన్‌లో చమురు సముద్రం

## 2 లక్షల కోట్ల లీటర్ల చమురు నిల్వలు

### భారత్‌కు గుడ్ న్యూస్.. నిర్ధారించిన కేంద్రమంత్రి

**(మొదటిపేజీ తరువాయి)**

అండమాన్ దీవుల తూర్పు తీరం నుంచి 9.20 నాటికల్ మైళ్లు, 17 కిలోమీటర్ల దూరంలో.. 295 మీటర్ల నీటి లోతులో తవ్విన శ్రీ విజయపురం 2 బావిలో ఈ సహజ వాయువు నిక్షేపాలు ఉన్నట్లు హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు. ప్రాథమికంగా నిర్వహించిన పరీక్షల్లో గ్యాస్ ఉనికి బయటికి వచ్చిందని పేర్కొన్నారు. పరీక్షల్లో సేకరించిన నమూనాలను నౌక ద్వారా కాకినాడకు తీసుకువచ్చి పరీక్షించగా.. అందులో 87 శాతం మీథేన్ ఉన్నట్లు తేలిందని కేంద్రమంత్రి వివరించారు. ఈ ప్రాంతం మయన్మార్ నుంచి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్న ఇంధన సంపదకు కేంద్రంగా ఉందని తెలిపారు. ఈ ఆవిష్కరణతో అండమాన్ బేసిన్‌లో హైడ్రోకార్బన్‌లు ఉన్నాయని ఎప్పటి నుంచో మనం నమ్ముతోంది నిజమైందని హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. నేషనల్ డీప్‌వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్ ప్రకటించగా, ఈ నేషనల్ డీప్‌వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్ లక్ష్యాలను చేరుకోవడంలో తాజా ఆవిష్కరణ ఒక ప్రధాన ముందడుగుగా మారనుందని కేంద్రమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మిషన్‌ను సముద్ర మంథన్ అని అభివర్ణించిన ప్రధాని మోదీ.. ఇంధన రంగంలో దేశాన్ని ఆత్మనిర్భర్ చేసేందుకు ఉద్దేశించబడిందని పేర్కొన్నారు. ఇక ఈ సరికొత్త సహజ వాయువు నిల్వలను కనుగొని.. హైడ్రోకార్బన్ నిల్వలను పూర్తిగా వినియోగించుకోవడానికి దేశీయ, ప్రపంచ స్థాయి నిపుణులతో సమన్వయం చేసుకుంటున్నట్లు హర్దీప్ సింగ్ పూరీ వెల్లడించారు. రాబోయే కొన్ని నెలల్లో మరిన్ని డీప్‌వాటర్ అన్వేషణ బావుల తవ్వకాలకు ప్రణాళికలు రచించినట్లు చెప్పారు. భారతదేశ అమృత కాలం ప్రయాణంలో ఈ సహజ వాయువు ఆవిష్కరణ ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని కేంద్రమంత్రి నొక్కి చెప్పారు.

# స్థానికానికి సర్వం సిద్ధం

## మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు.. రెండు దశల్లో ఎంపీటీసీ/జడ్పీటీసీ పోలింగ్

**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. దాదాపు 1.67 కోట్లకు పైగా గ్రామీణ ఓటర్లు పాల్గొననున్న ఈ ఎన్నికలను బహుళ దశల్లో నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. గ్రామ పంచాయతీ (సర్పంచ్, వార్డు సభ్యుల) ఎన్నికలను మూడు దశల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ కోసం రూ. 350 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా.. ఇప్పటికే రూ. 3.08 కోట్లు విడుదలయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులకు ప్రత్యక్షంగా ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 5,763 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలకు కూడా ఓటింగ్ నిర్వహించనున్నారు. అయితే, 565 మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), 31 జిల్లాల జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాలకు మాత్రం పరోక్షంగా ఎన్నిక జరగనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగనుండగా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మాత్రం 11 గుర్తింపు పొందిన పార్టీలు, 31 నమోదు చేసుకున్న




పార్టీలు తమ గుర్తులపై పోటీకి దిగనున్నాయి. దశల వారీగా పోలింగ్ వివరాలు చూసినట్లయితే.. మొదటి దశలో 41 మండలాల్లోని 1,098 గ్రామాలు, 9,324 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండో దశలో 272 మండలాల్లోని 5,910 గ్రామాలు, 52,190 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. మూడో దశలో 252 మండలాల్లోని 5,752 గ్రామాలు, 51,020 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. మొదటి దశలో 290 జడ్పీటీసీలు, 2,977 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. రెండో దశలో 275 జడ్పీటీసీలు, 2,786 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం గ్రామీణ ఓటర్లు 1,67,03,168గా ఎన్నికల సంఘం గుర్తించింది. వీరిలో 85,36,770 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకాన్ని కూడా ఎస్ఈసీ ప్రారంభించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు 651 మంది ఆర్వోలు, 2,337 మంది ఏఆర్వోలు సహా 1,98,258 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండు దశలకు కలిపి దాదాపు 2 లక్షల 7 వేల మంది సిబ్బంది పాల్గొంటారు. బ్యాలెట్ బాక్స్‌ల విషయానికి వస్తే, 1,72,916 బాక్స్‌లు అవసరం కాగా.. ఇప్పటికే 1,18,547 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు.

**నేడు నోటిఫికేషన్ ?**

స్థానిక సంస్థల న్నికల నోటిఫికేషన్ నేడు వెలువడే అవకాశాలున్నాయి. తొలుత జడ్ పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించి తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఎస్ఈసీ సన్నద్ధమైంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు సన్నద్ధంగా ఉన్నామని ఎస్ఈసీ ఇప్పటికే హైకోర్టుకు తెలిపింది. ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలంటూ అధికార కాంగ్రెస్ పార్టీ తన శ్రేణులను అదేశించింది.



## మద్యం వినియోగంలో కర్ణాటక టాప్

- సెంకడ్ తమిళనాడు, థర్డ్ ఏపీ.. ఆ తర్వాత తెలంగాణ
- కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ వెల్లడి

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** భారత్‌లో తయారయ్యే విదేశీ మద్యం వినియోగంలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి. మద్యం అమ్మకాలకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరంలో 58 శాతం రాబడి ఈ రాష్ట్రాల నుంచే వచ్చింది. దేశవ్యాప్తంగా విస్కీ వినియోగంలో కర్ణాటక తొలి స్థానంలో నిలిచిందని (అమ్మకాల్లో 17శాతం) కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) వెల్లడించింది. పుదుచ్చేరితోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు మద్యం అమ్మకాల్లో జోరును కొనసాగించాయి. దేశవ్యాప్తంగా 40.17 కోట్ల విస్కీ కేసుల అమ్మకాలు జరగగా.. దక్షిణాది రాష్ట్రాల్లోనే 58శాతం వినియోగం కనిపించింది. ఈ రాష్ట్రాల్లో 23.18 కోట్ల కేసులు అమ్ముడైనట్లు సీఐఏబీసీ వెల్లడించింది. కర్ణాటకలో అత్యధికంగా 6.88 కోట్ల కేసులు (17శాతం) అమ్ముడవగా, 6.47 కోట్ల కేసులతో తమిళనాడు (16శాతం) రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ (3.55 కోట్లు), తెలంగాణ (3.1 కోట్లు), కేరళ (2.29 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 0.28 కోట్ల కేసుల అమ్మకాలతో పుదుచ్చేరి 19వ స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలో గతేడాది 2.71 కోట్ల విస్కీ కేసులు అమ్మడయ్యాయి.





# భారత్ జయభేరి..

## తెలుగోడి దెబ్బ అదుర్స్.. పాక్ చిత్తు చిత్తు

- ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్ పై విజయఢంకా
- 9వ సారి ఆసియా కప్ విన్నర్ గా టీమ్ ఇండియా
- హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ సూపర్ ఇన్నింగ్స్
- నాలుగు వికెట్లతో పాక్‌ను దెబ్బతీసిన స్పిన్నర్ కుల్దీప్
- భారత్ విజయంపై దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువ

**మహా, నెట్ వర్క్:** ఆసియా కప్ ఫైనల్లో అజేయ భారత్ జయభేరి మోగించింది. ఊహించిన దానికంటే ఉత్కంఠగాసాగిన టైటిల్ పోరులో తిలక్ వర్మ (69 నాటౌట్) వీరోచిత పోరాటంతో ఐదు వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 41 ఏళ్ల తర్వాత చిరకాల ప్రత్యర్థులు తలపడిన టైటిల్ పోరు అసలైన క్రికెట్ మజాను అభిమానులకు అందించింది. మునివేళ్లపై నిలబెడుతూ సాగిన పోరులో భారత్. తిలక్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. సంజూ శాంసన్ (24), శివం దూబే(33)లతో అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పిన తిలక్.. రవుఫ్ వేసిన చివరి ఓవర్లో సిక్సర్‌తో విజయాన్ని ఖాయం చేశాడు. ఒకే రన్ అవసరంకాగా.. రింకూ సింగ్(4 నాటౌట్) బౌండరీ బాదడంతో తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలిచింది. లీగ్ దశ సూపర్ 4లో అలవోకగా నెగ్గిన టీమిండియాకు ఫైనల్లో పాకిస్థాన్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఛేదనలో టోర్నీ ఆసాంతం అదరగొట్టిన అభిషేక్ శర్మ(5) ఫైనల్లో ఉసూరుమనిపించాడు. పెద్ద షాట్లతో విరుచుకుపడాలనుకున్న అభిని పాక్ పేసర్ ఫహీం స్లో డెలివరీతో బోల్తాకొట్టించాడు. ఆ కాసేపటకే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(1) లాంగాఫ్‌లో షాట్‌కు యత్నించి సల్మాన్ అఘా చేతికి దొరికాడు. దాంతో..2.3 ఓవర్లలో 10 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. సమోచితంగా ఆడాల్సిన ఓపెనర్ శుభ్‌మన్ గిల్(5 నాటౌట్) సైతం ఫహీం ఓవర్లోనే రవుఫ్ చేతికి దొరికాడు.. అయినా సరే తిలక్ వర్మ (1నాటౌట్) ఒత్తిడిలోనయూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. నాలుగో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సంజూ శాంసన్(24) ఔటయ్యాడు. అబ్రార్ ఓవర్లో బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా సంజూ ఆడిన బంతిని ఫఖర్ చక్కగా అందుకున్నాడు. దాంతో.. 57 పరుగుల విలువైన భాగస్వామ్యానికి తెరపడింది. సంజూ శాంసన్(24)తో కలిసి 44 బంతుల్లో 50 రన్స్ జోడించాడు. అబ్రార్ ఓవర్లో తిలక్, ఆయూబ్ ఓవర్లో చెరొక సిక్సర్ బాదిన ఈ ఇద్దరూ జట్టు స్కోర్ 70 దాటించారు. రన్‌రేటు పెరుగుతున్నందున పెద్ద షాట్‌కు యత్నించిన సంజూ వెనుదిరిగాడు. ఇంకా విజయానికి 46 బంతుల్లో 70 రన్స్ కావాలి. రవుఫ్ వేసిన 15వ ఓవర్లో.. దూబే బౌండరీ బాదగా చివరి బంతిని తిలక్ స్టాండ్స్‌లోకి పంపగా జట్టు స్కోర్ వందకు చేరింది. రవుఫ్ వేసిన 18వ ఓవర్లో శివం దూబే(33) సిక్సర్‌తో సమీకరణం 12 బంతులకు 17 రన్స్‌గా మారింది. ఫహీం మూడు బంతులకు మూడు రన్స్ రాగా.. నాలుగో బంతిని బౌండరీకి పంపాడు దూబే.. చివరి బంతికి ఔటయ్యాడు. చివరి ఓవర్లో 10 రన్స్ అవసరమవ్వగా.. తిలక్ సిక్సర్‌తో జట్టును విజయానికి చేరువ చేశాడు. రింకూ సింగ్ బౌండరీ కొట్టడంతో రెండు బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్ల విజయంతో విజేతగా నిలిచింది.



## సోలార్ పవర్ విలేజ్ గా సీఎం రేవంత్ స్వగ్రామం

- దక్షిణ భారతదేశంలోనే మొదటి గ్రామంగా గుర్తింపు
- రూ 10.53 కోట్లతో 514 ఇండ్లతో పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టు

**నాగర్ కర్నూల్, మహా:** నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండలం అచ్చంపేట నియోజకవర్గంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి, దక్షిణ భారతదేశంలోనే పూర్తిగా సౌర విద్యుత్ వినియోగిస్తున్న మొదటి గ్రామంగా గుర్తింపు పొందనుంది. కాగా దేశంలో రెండలోది కానుంది. టీజీ రెడ్కో ద్వారా రూ 10.53 కోట్లతో 514 ఇండ్లతో పాటు 11 ప్రభుత్వ భవనాలకుసౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామంలోని ప్రతి ఇంటికి 3 కిలో వాట్స్ సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కేడబ్ల్యూ సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. కొండారెడ్డి పల్లిలో మట్టి గోడలతో ఉన్న 34 ఇండ్ల కుటుంబాలు కూడా సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, ఇండ్ల పైన సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు టీజీ రెడ్కో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ కె. మనోహర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో మొత్తం 1,500 కేడబ్ల్యూ సామర్థ్యపు సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను , ఇంటి వినియోగానికి పోగా,మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అనుసంధానం చేశారు. గ్రిడ్ కు పంపే విద్యుత్ ఒక యూనిట్ కు రూ 5.25 చొప్పున చెల్లించుటకు లబ్ధిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకున్నది. సెప్టెంబర్ నెలలో విద్యుత్ గ్రిడ్ కు ఇండ్ల వినియోగానికి పోగా మిగిలిన విద్యుత్ గ్రామం మొత్తం నుండి సుమారు ఒక లక్ష యూనిట్స్ ఎగుమతి ద్వారా రూ 5 లక్షలు ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించారు. కొండారెడ్డి పల్లి గ్రామం సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు మొత్తం వ్యయంలో నుండి, సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటు సౌర విద్యుత్ కు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ, ప్రీమియర్ ఎనర్జీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు, మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ.10.53 కోట్లు నిధులు ఖర్చు చేశారు.

## మావోలతో కాల్పుల విరమణ ప్రసక్తే లేదు

### ఆయుధాలను వీడి ముందుకు రండి... ఒక్క బుల్లెట్ కూడా పేలదు

### కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** ఆయుధాలు వదిలేసి చర్చలకు వచ్చే విషయంలో మావోయిస్టుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టుల కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. భద్రతాదళాలు వారిపై ఒక్క బుల్లెట్ కూడా ప్రయోగించబోవని హామీ ఇచ్చారు. ఢిల్లీలో 'నక్సల్ రహిత భారత్'పై నిర్వహించిన సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. 'గందరగోళం సృష్టించేందుకే మావోయిస్టుల నుంచి ఇటీవల ఓ లేఖ బయటకు వచ్చింది. ఇప్పటివరకు జరిగింది పొరపాటు అని, కాల్పుల విరమణ ప్రకటించాలని, తాము లొంగిపోవాలనుకుంటున్నామని అందులో పేర్కొన్నారు. ఒకవేళ మావోయిస్టులు లొంగిపోవాలనుకుంటే.. కాల్పుల విరమణ అవసరం లేదు. ఆయుధాలను వీడి ముందుకు రండి. ఒక్క బుల్లెట్ కూడా పేలదు. రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతాం. పునరావాసం కల్పిస్తాం'' అని అమిత్ షా తెలిపారు.





ఎఎన్ఎన్ స్కూల్ ఆఫ్ జర్నలిజం ఆన్ లైన్ శిక్షణ మొదటి బ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, శిక్షకులు ముద్దం నరసింహస్వామి, డిజిటల్ హెడ్ రాకేష్, టెక్నికల్ సిబ్బంది, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లాఠీఛార్జ్ వల్లే ప్రమాదం!

- తొక్కిసలాట వెనుక కుట్ర కోణం ఉంది
- ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలి
- మద్రాస్ హైకోర్టు ఆశ్రయించిన టీవీకే పార్టీ



**తమిళనాడు, మహా:** కరూర్ జిల్లాలో టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. దీనిలో కుట్ర కోణం ఉందని, స్వతంత్ర దర్యాప్తు జరపాలంటూ ఆ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ర్యాలీ జరుగుతుండగా రాళ్లు రువ్వడంతో పాటు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నట్లు టీవీకే తెలిపింది. దీంతో తొక్కిసలాట చోటు చేసుకొన్నట్లు ఆరోపించింది. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సోమవారం మద్రాస్ హైకోర్టులోని మధురై బెంచ్‌ను ఆశ్రయించనున్నట్లు వెల్లడించింది. ఘటనలో కుట్ర కోణం ఉందనేందుకు.. ఈ ఘటనపై విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐకి అప్పగించాలని కోరనున్నట్లు టీవీకే న్యాయవాది అరివళగన్ ఓ వార్తా సంస్థకు చెప్పారు. ఘటనలో కుట్ర కోణం ఉందనేందుకు స్థానిక ప్రజల నుంచి తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. దీనికి సంబంధించి కొన్ని సీసీటీవీ దృశ్యాలు కూడా ఉన్నట్లు తెలిపారు. ర్యాలీలో నిబంధనలను ఉల్లంఘించారంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గత రెండు నెలలుగా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించగా.. ఎక్కడా ఇలాంటి ఘటన చోటు చేసుకోలేదన్నారు. కానీ, కరూర్‌లోనే తొక్కిసలాట జరగడంపై సందేహాలు ఉన్నట్లు తెలిపారు.

## విచారణ తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు!

### ఘటన వెనుక నిజానిజాలు బయటపడతాయి

### తొక్కిసలాటపై తమిళనాడు సీఎం స్టాలిన్ కీలక వ్యాఖ్యలు

**తమిళనాడు, మహా:** తమిళనాడులో టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి పైగా గాయపడగా వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ విచారణ అనంతరం ఘటన వెనుక నిజానిజాలు బయటపడతాయని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్టాలిన్ పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. 'కరూర్‌లో జరిగిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటివరకు 39 మంది ప్రాణాలో కోల్పోయారు. రాష్ట్ర చరిత్రలో ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఇంతమంది ప్రజలు మరణించడం ఇదే తొలిసారి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకూడదు. ప్రస్తుతం 51 మంది చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం అందిస్తాం' అని స్టాలిన్ పేర్కొన్నారు.


ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO : APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM, 95501 59679, 90001 41919

# కొల్లేటి కలలు

అనగనగా చిన్నప్పుడు
పక్షులను పక్కలో బజ్జోపెట్టుకొని
కునికిపాట్లు పడుతున్నప్పుడు
తాటిదోనెలో కూర్చుని కొల్లేరు
నన్ను జోకొట్టడానికి వచ్చేది
ఆఫ్రికా అడవుల నీడల్ని కప్పి
సైబీరియా సంగీతంతో నిద్రపుచ్చేది

నాకు కొల్లేటి కలలున్నట్లే
కొల్లేటికు కూడా నా గురించిన
కలలున్నాయి
మొన్న కొల్లేరు వెళ్ళినప్పుడు
అలా కలలు కలబోసుకున్న
మా కలయికను చూసి
పాలపుంతల పాపలు పకపకా నవ్వారు

ఊరెళ్ళినప్పుడల్లా నేను కొల్లేరై
కొల్లేరు వైపు ప్రవహిస్తాను
అక్కడ నా కలల్లో మాత్రమే మిగిలిన
పక్షుల కోసం వెతుకుతాను
పక్షులు కూడా తమ కలల్లో మాత్రమే
మిగిలిన నన్ను గుర్తుపడతాయి

ఆకాశాన్ని నోట కరిచి పక్షులు ఎటో ఎగురుతున్నట్టు
పక్షులను కాళ్లుగా చేసుకుని
ఆకాశం ఎటో నడుస్తున్నట్టు
కొల్లేటి నీటిపై ఎండ విదిల్చిన నీడలు

పల్లవులు.. గజపతులు
కోట.. పడవ.. పక్షి..
నా భుజం నుంచి చరిత్ర
పాటలా జారి నేల మీద పడి
నన్ను తోకలా చేసుకుని
జరజరా ఎటో కదిలిపోయింది

కొల్లేటి సరస్సులో చేపలన్నీ కలిసి
రెండు కళ్ళుగా మిగిలినట్లు
పెద్దింట్లమ్మ పెద్ద కళ్ళు చేసుకుని
నన్నే చూసింది

వేల వత్సరాల
పక్షి వలసల జ్ఞాపకాలు
ఆ చూపులు

ఊరొచ్చినప్పుడల్లా కొల్లేరంటావు
కొల్లేరొస్తే నేనే పక్షినంటావు..
చేపనంటావు.. పడవనంటావు
అసలేంట్రా నీ కత
అన్నాడు మిత్రుడు
కొల్లేరే నా కత అన్నాను

గట్టుమీద నిలబడ్డాను
ఎండ కత్తెరతో కండల్ని
కత్తిరించుకుంటున్నారు
సామూహిక వ్యవసాయ
సమిష్టి శ్రామికులు
నేను నిలబడ్డవి గట్లు కాదు
వారి చెమట బొట్లు

మిత్రులూ నేనూ
ఒక పడవ ఎక్కాము
పడవ నడుపుతూ అతను పాటందుకున్నాడు
కాలాల అలల కొల్లేటి రాగాలతో
గాలి సోయగాలు పోయింది

ఎవరో తల్లి చేపలు అమ్ముతోంది
మిత్రులు బేరమాడుతున్నారు
ఆమె బట్టలో నేను కూడా ఉన్నానని
పాపం వారికి తెలియదు

కొల్లేరు అంటే ఏంటని
ఒక తెల్ల మొహం అమ్మాయి
నల్లని కళ్ళతో నవ్వింది
అప్పుడే సైబీరియాలో
పుట్టిన ఒక పక్షి
తాతముత్తాతల జ్ఞాపకాలతో
పొలమారింది

కొల్లేరు అంటే



- ప్రసాద మూర్తి, 84998 66699

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదు
అది కేవలం బొమ్మలే ఇస్తుంది
నా కవిత్వం చదవండి
ఆ బొమ్మలకు ప్రాణం పోస్తుంది

సూర్యుడు సేద దీరిన క్షణాలు
చంద్రుడు ఈదులాడిన యుగాలు
రక్కీసు పొదల్లో చిక్కుకున్న
ఫెలికాన్ పక్షుల స్వప్నాలు
ఈ నా అక్షరాలు

మీసాల ఆసాములు
రొయ్యల మీసాలను
రొక్కం చేసుకున్నారు
వ్యాపార మారాజులు
చేపల దీపాలతో
పండగ చేసుకున్నారు
కొల్లేటి సరస్సు కడుపులో
కోటి ఉషస్సుల గర్భస్రావం

ఇప్పుడు కొల్లేరంటే
రొయ్యలు..చేపలు..
కాటాలు.. క్వింటాళ్లు..
ట్రక్కులు.. లెక్కలే
నా అక్షరాలు మీకు అర్థం కావు
అవి ముక్కలైన ఒక అపార సరస్సు
సజీవ అస్థిపంజరాలు

కోటలేదు
కోట చుట్టూ నీటి తోటలేదు
మనుషులూ పక్షులూ
కలిసి వ్యవసాయం చేసిన
సమష్టి క్షేత్ర సామూహిక
బృంద గానాలు లేవు
ఇదిగో ఇలా ఈ నా అక్షరాల్లో
కొల్లేటి కలలున్నాయి.


మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 29-09-2025
సాహిత్యం LITERATURE 04


# తొలి చినుకు స్పర్శ లాంటి, మానవీయ కంపనమే కవిత్వం

కవిత్వమంటే ఏమిటి? కొన్ని సంవత్సరాలుగా కవిత్వం రాస్తున్న లబ్ధ ప్రతిష్టులైన కవులను అడిగినా సరే కవిత్వం అంటే ఇదే అని చెప్పలేరు . ఎందుకంటే అది అనిర్వచనీయం కనుక. కానీ కవిత్వం రాయడానికి ఏఏ వస్తువులు కావాలో చెప్పమంటే తడుముకోకుండా చెపుతారు . అలనాటి అల్లసాని పెద్దన అయితే

నిరుపహతి స్థలంబు రమణీ
ప్రియ దూతిక తెచ్చి ఇచ్చు
క ప్పురవిడే మాత్మకింపైన భోజన
ముయ్యల మంచ మొప్పు
ప్పరయి రసజ్ఞులూహ తెలియంగల లేఖక
పాఠకోత్తముల్
దొరికిన గాన నూరక కృతుల్ రచియింపు
మటన్న శక్యమే

అని కవిత్వ రచనకు ఏమేమి దినుసులు కావాలో చెప్పాడు. అది పురాతన కాలం కనుక అది సరిపోయింది. కానీ ఆధునిక కాలం లో ఆధునిక మహాకవి శ్రీశ్రీ

సింధూరం రక్త చందనం
బందూకం సంధ్యాగగనం
పులి చంపిన లేడి నెత్తురు
ఎగరేసిన ఎర్రనిజెండా
రుద్రాలిక నయన జ్వాలిక
కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవకవనానికి
అన్నాడు

అల్లసాని పెద్దన నిరుపహతి స్థలము చెప్పి శతాబ్దాలు గడచిపోతే ,శ్రీశ్రీ నవకవిత చెప్పి కూడా కొన్ని దశాబాలు గడచిపోయాయి ఇప్పుడొక అత్యాధునిక కవి కవిత్వంగురించి ఏమిచెపుతుందో చూడండి

ప్రేమ మాత్రమే
దుఃఖం మాత్రమే
విప్లవం మాత్రమే
ఆకలి మాత్రమే
ఒక పద్యాన్ని నిర్మించలేవు

రండి
కవిత్వం ఎలా తయారవుతుందో
నేను చెపుతాను

మాటలన్నింటినీ మరచి
ఒక పురాతన విస్మృతిలోకి
మనలని మనం కోల్పోయే
ఒకా నొక సొగసైన మృత్యువు కవిత్వం

కొన్ని శతాబ్దాల అర్థం లేని
అసమంజస చాకిరీ నుండి బానిసత్వం నుండి
మనలని రక్షించి ఒక కొత్త ఉద్వేగం లోకి
ఒక కొత్త విజయం లోకి తీసుకుని వెళ్లే
కాంతిపుంజం లాంటి పాప కవిత్వం

మీరు యవ్వనం లో ఉన్నప్పుడూ
మీరు వృద్ధాప్యం తో సహవాసం చేస్తున్నప్పుడూ
ఏ క్షణమైనా మీ నరాలలోకి
వ్యాపించగల, తొలి చినుకు స్పర్శ లాంటి,
మానవీయ కంపనమే కవిత్వం

సుదీర్ఘ రాత్రి వెళ్ళిపోయాక
మీ కళ్ళ లోకి పొరలు పొరలుగా తనను తాను
పిండుకునే తాజాస్వప్నం కవిత్వం

అతి సాధారణమైన పాపానికి
అసంబద్ధమైన మృత్యువుకి
అతీతంగా కరకు విషాద వాస్తవాన్ని
దిగ్భ్రాంతి లోకి నెట్టేసి అధిగమించే కల కవిత్వం

అమానవీయత అదృశ్యంగా నూ
తాజా స్వప్నం అందుకోలేని రూపంగానూ ఉంటే
కవిత్వం మాత్రం అంతకు మించి

రండి
మీకొంత వివరణ ఇస్తాను
కవిత్వం
మానవుడి నిస్సహాయత అనే చీకటి
కలుపుమొక్కలని
తొలగించేస్తుంది
ఒకానొక చిన్న భూ క్షేత్రంలో
గొయ్యి తవ్వి తనను తాను విత్తనంలా
పాతుకుంటుంది
ఒక మాహాద్భుతమైన వృక్షంలా ఎదిగి
పూల తోనూ, పళ్ళ తోనూ వికసించి, విరబూసి
ఒక రక్షణ నిలయంలా, ఒక భరోసాలా మారుతుంది
కవిత్వం అంటే ఎప్పటికీ కాంతులీనే
ఆకాశ నక్షత్రం

కవిత్వం అంటే పూలతోనూ, పళ్ళతోనూ వికసించి విరబూసే రక్షణ నిలయం అనీ , ఎప్పటికీ కాంతులీనే ఆకాశ నక్షత్రం అనీ నిర్వచనలిచ్చిన ఈ కవి గాయత్రీబాల పాండా ఒడిషా కవి . 2022 వ సంవత్సరానికి గాను కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు ఆమె కవిత్వాన్నీ వరించింది . ఇప్పటికే కవిత్వ సంపుటాలు 11 హిందీ, అనువాదాలు 2, ఆంగ్ల అనువాదాలు 2 సంపుటాలలో లభ్యం అవుతున్నాయి. ఒడిషా ప్రముఖంగా భావించే పలు పురస్కారాలు ఆమెను అలవోకగా వరించాయి.

స్త్రీల ఆంతరంగిక వేదన గురించీ, స్త్రీల దుఃఖం గురించీ , చాలా విస్తృతంగా గా రాసే గాయత్రికి ఫెమినిస్టు అనే టాగ్ తగిలించుకోవడం అస్సలు ఇష్టం ఉండదు. Gayatribala Panda is not comfortable with the tag of a feminist, but the anguish of women — particularly that of the ordinary, the dispossessed and the tortured — forms the core of Gayatribala Panda's poetry. Her language is eloquent but simple, making it appealing both to the masses and the intelligentsia.అని ప్రముఖ దినపత్రిక ఇండియన్ ఎక్స్ప్రెస్ ఆమె కవిత్వాన్ని విశ్లేషించింది. ఆమె కవిత్వ సంపుటాల పేర్లు చూస్తే చాలు ఆమె కవిత్వ తాత్వికత మనకు తేలికగా అర్థం అవుతుంది

గాయపడిన వాగ్దానాలు , కనిపించే ఆకాశం ఏదైనా, ఈ రాత్రి ఈ నక్షత్రాలు , కళ్ళు చెవులు లేవు, అస్పష్టమైన దేవుడు ఇవీ ఆమె కవిత్వ సంపుటాలు పేర్లు గాయత్రి, 1977 ఏప్రిల్ 17న ఒడిశాలోని కటక్ జిల్లా (ప్రస్తుత జగత్సింగ్‌పూర్ జిల్లా) సదేయిపూర్ గ్రామంలో గోలక్ బిహారీ పండా,అరుణిమా పండా దంపతుల మొదటి సంతానంగా జన్మించింది. ఆమె తన ప్రాథమిక విద్యను కటక్,సదేయిపూర్ లలో అభ్యసించిన తరువాత కటక్‌లోని శైలబాల విమెన్స్ కాలేజీలో కళాశాల విద్యను అభ్యసించింది. ఉత్కళ విశ్వవిద్యాలయం నుండి లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీని, ధెన్కనాల్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో జర్నలిజం మాస్ కమ్యూనికేషన్‌లో పీజీ డిప్లొమా చేసింది. ఆ తర్వాత హిమాచల్ ప్రదేశ్ వి




శ్వవిద్యాలయం, షిమ్లా నుండి జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసింది. ఉత్కళ విశ్వవిద్యాలయం నుండి లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పీహెచ్‌డీని పొందింది.

జర్నలిజంను వృత్తిగా ఎంచుకుని, ప్రముఖ ఒడియా వార్తాపత్రిక 'సంబద్'లో చేరింది. కొన్ని సంవత్సరాలు ఫీల్డ్ మరియు డెస్క్ రెండింటిలో పనిచేసిన తర్వాత, ప్రస్తుతం ఆమె విస్తృతంగా ప్రశంసలు పొందిన సాహిత్య త్రైమాసికం "అన్యా"ను సంపాదకత్వం వహిస్తూ, ప్రచురిస్తోంది.

పులి ఆమె తాజా కవిత్వ సంపుటి . ప్రతి మనిషి లోనూ అదృశ్యంగా ఒక పులి ఉంటుంది. పులికీ, మనిషికీ మధ్య ఒక చిన్న చుక్క కనిపించీ కనిపించనంత సూక్ష్మంగా ఉంటుంది ఏ క్షణమైనా మనిషి పులిలాగా మారవచ్చు. మనిషిని పులిగా మార్చగలిగింది ఒక మానసిక స్థితి మాత్రమే అన్నది ఈ కవిత్వ సంపుటి సారాంశం

కళ అనే ఈ చిన్న కవిత చూడండి
కళ



మాంసం అమ్మడం లాగే
మాంసం కొనడం కూడా ఒక కళ

కనుక ప్రతిదీ ఒక మాంసం గా
మారిపోతుంది

ఫ్లెష్ మార్కెట్ అని పదం దేనికి సూచనో మనందరికీ తెలుసు. స్త్రీ అంటే ఒక మాంసం ముద్ద అనుకునే చోట అమ్మడం, కొనడం అనేవి వ్యాపార, వాణిజ్య పద సముచ్చయాలు కావు . అవి ఒక కళాత్మక వ్యక్తీకరణలు. అయితే అది ఎలాంటి కళాత్మక వ్యక్తీకరణ అనేది వేరే ప్రశ్న

పెట్టుబడి
ఒక స్త్రీ తన మూలధనాన్ని
ఎక్కడ పెట్టుబడి పెడుతుంది?
కుటుంబం,ప్రేమ,పుణ్యం,పాపం

ఒక స్త్రీ తనను తాను
ఎలా ఇన్వెస్ట్ చేసుకుంటుంది
ఈ ప్రశ్న ఎదురైన
ప్రతి సారీ
జవాబును వెతకడం లో
నేను విఫలమవుతాను

చిన్న కవితే ఇది కానీ ఎంత లోతైన అర్థాన్ని ఇస్తున్నది?భాష ఎంత సరళంగా ఉంటే కవిత అంత బలంగా ఉంటుంది అంటుందామె

పుస్తకాలు
తన అభిరుచికి అనుగుణంగా
ఒక పుస్తకాన్ని తెరచీ, మూసివేసినట్టుగా
ఆమె తనను తాను విప్పుకుంటుంది
తన పురుషుడి కోరికలకు అనుగుణంగా
ఒక సరోవరం లో ఈత కొట్టినట్టు

ఆమె అనే పుస్తకం లోని పేజీల మధ్య ఈదుతూ
కాస్త విశ్రాంతి తీసుకుంటూ అతడు
తనకు ఇష్టమైనప్పుడు పుటలోని
ప్రతి అక్షరాన్నీ జాగ్రత్తగా చదువుతూ
తను అలసినప్పుడు
పుస్తకాన్ని మూలకు విసరికొడుతూ
సంతృప్తిగా అతడు
నిద్రలోకి జారుకుని
మొదట మెల్లగా, పిదప పెద్దగా
అతడు గురక పెడతాడు

స్త్రీ పురుష సంగమం లోని వైరుధ్యాలను ఇంతకంటే గొప్పగా చెప్పడం ఎవరికైనా సాధ్యమవుతుందా?

నిర్మాణం
అత్యంత వేగంగా ప్రవహించే
నా రక్తం లో నుండి విద్యుత్తును సృష్టించి
నన్ను నేను వెలుగులో నిలుపుకుంటాను

నా ఎముకల మూలుగ లో నుండి
నాక్కావలసిన ఆయుధాలు తయారుచేసుకుని
నా రక్షణ కై నేనే భరోసా ఇచ్చుకుంటాను

లోతు కనుగొనలేని నా మాంసపు గుంత లో నుండి
ఒక సొరంగాన్ని తవ్వుకుని
అక్కడ, అక్కడ నేను
కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకుంటాను

ఈ నిర్మాణ కౌశలం గురించి
ఎవ్వరికీ తెలియదు

స్త్రీల కోసం ఒక బంకర్ కావాలి అన్యాపదేశంగా ఈ కవితలో చెపుతూ, దేశం లో స్త్రీలు పురుషులతో సమానంగా స్వేచ్ఛగా లేని పరిస్థితులను గుర్తు చేస్తూ, వాళ్ళ రక్షణకు ఒక బంకర్ కావాలి అంటున్నది. కాస్త వింతగానూ, అతిశయోక్తిగానూ తోచవచ్చు కానీ అది మాత్రం అక్షరమక్షరం సత్యం

గాయత్రీ బాల పాండా కవిత్వం అమెజాన్ లో లభ్యం అవుతుంది. ఆసక్తి ఉంటే కొని చదువుకోవచ్చు. ఈ కవిత్వం చదవడం ఒక మంచి అనుభవం

- వంశీకృష్ణ, 9573427422

# అస్తిత్వ ఉద్యమాల అడుగులు గాజోజు సాహిత్యం

డా.పెద్దింటి అశోక్ కుమార్
9441672428

కొందరు రాతల్లో పారదర్శకంగా ఉంటారు. కొందరు చేతల్లో పారదర్శకంగా ఉంటారు. కానీ రాతల్లోను, చేతల్లోను రెండింటిలోనూ పారదర్శకంగా ఉండే వారు అరుదు. అటువంటి అరుదైన వ్యక్తులలో ఒకరు గాజోజు నాగభూషణం గారు. కవి, రచయిత, గాయకుడు, వ్యాసకర్త, ఉపాధ్యాయుడు, ఉద్యమకారుడు అన్నింటికీ మించి ఒక మానవతావాది, స్నేహశీలి, మితభాషి, చిరునవ్వుతో పలకరించే మిత్రుడు. ఆయన వ్యక్తిత్వం సున్నితమైన హృదయం, సమాజం పట్ల అపారమైన చైతన్యంతో నిండి ఉంది.

**మూడు దశాబ్దాల సాహిత్య–ఉద్యమ యాత్ర :**

ఉపాధ్యాయుడిగానే కాకుండా సాహిత్యకారుడిగా, ఉద్యమకారుడిగా మూడు దశాబ్దాలుగా ఆయన కొనసాగుతున్న ప్రయాణం ఎంతో విశిష్టమైనది. మేమంతా ప్రేమగా "అన్నా" అని పిలుచుకునే నాగభూషణం గారు నాకు పాతికేళ్లకు పైగా పరిచయం. నేను రచయితగా మొదటి అడుగులు వేస్తున్న సమయంలో తెలంగాణ రచయితల వేదిక ఏర్పడింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు ఒకే వేదికపైకి వచ్చి స్వరాష్ట్రం కోసం అహర్నిశలు పోరాడుతున్న ఆ సమయంలో ఆయన నాయకత్వం ఉద్యమానికి ఊపిరి నిచ్చింది.తెరవేఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆయన మార్గనిర్దేశకత్వంలో అనేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. రచనలోనూ, గానంలోనూ, ఉద్యమంలోనూ, ఉపాధ్యాయ వృత్తిలోనూ తనదైన ముద్ర వేసిన ఆయన నిజమైన బహుముఖ ప్రజ్ఞాశాలి.

**ఉద్యమ పుట్టినిల్లు – జగిత్యాల:**

జగిత్యాల ఆయన పుట్టినూరు. ఆ పట్టణం ఎప్పటినుంచో ఉద్యమాలకు కేంద్రమైంది. రైతాంగ పోరాటాలు, కార్మిక ఉద్యమాలు, తెలంగాణ ఆత్మగౌరవ పోరాటాల ప్రభావం చిన్నప్పటినుంచే ఆయనలో జీర్ణించుకుపోయింది. ఆ వాతావరణమే ఆయనను కవి, వాగ్గేయకారుడిగా మలిచింది. ఆయన రచనలన్నీ చైతన్యవంతంగా, మార్గదర్శకంగా నిలుస్తూ భవిష్యత్ సమాజ నిర్మాణాన్ని సూచిస్తాయి.కవితలు, పాటలు, వ్యాసాలే కాకుండా కథలు రాయడంలో కూడా ఆయన తన ప్రతిభను



చూపారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి జీవితాలు ఆయన కథల్లో స్పష్టంగా కనిపిస్తాయి.

**ఉద్యమం – సాహిత్యం – సమాజం;**

ఉద్యమం ఉధృతంగా ఉన్న రోజులలో రైలు రోకోలు, రాస్తా రోకోలు, మిలియన్ మార్చ్, సాగరహారం, సకల జనుల సమ్మె, సడక్ బంద్ వంటి ప్రతి కార్యక్రమంలో ఆయన ప్రత్యక్ష పాత్ర పోషించారు. ఆత్మవిశ్వాసం నింపే ప్రసంగాలు చేస్తూ కవిత చదివి, పాట పాడి వేదికను ఉత్సాహ భరితంగా మార్చేవారు.ఉద్యమ భావజాల వ్యాప్తి లో భాగంగా ఆయన నాయకత్వంలోని తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అనేక మహాసభలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడ్డాయి. వేదికను విస్తరించి అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక మహాసభలను కూడా విజయవంతంగా నిర్వహించారు.ఒక రచయితల వేదిక అనే కాకుండా పలు సామాజిక సంస్థల ఉద్యమ సంస్థల లో భాగస్వామిగా ఉన్నాడు. పలు కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా తనదైన ముద్ర వేసాడు. అనేక సాహితీ సంస్థలతో ఆయనకు అనుబంధ ఉంది. వాటికి నాయకత్వం వహించి పనిచేశాడు కూడా.

**ప్రజా సమస్యలపై అధ్యయన యాత్రలు;**

సామాజిక బాధ్యత పట్ల ఆయనకు ఉన్న అంకితభావం అనేక యాత్రలలో కనిపించింది.గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేక ఉద్యమం, పోలవరం ముంపు బాధితుల అధ్యయన యాత్ర, చెంచు గిరిజనుల జీవన స్థితిగతులపై పరిశీలన, సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యల నిరోధానికి భరోసా యాత్ర,గల్ఫ్ బాధితుల సమస్యలపై రుద్రంగి యాత్ర, మిడ్ మానేరు, మల్లన్నసాగర్ ముంపు గ్రామాల పరిశీలన,ఓపెన్ కాస్ట్ మైనింగ్ వ్యతిరేక ఉద్యమాలుకోటిలింగాల ధూళికట్ట, బొమ్మలగుట్ట, కోట్ల నరసింహుల పల్లె పరిరక్షణ యాత్రలు,ఇంద్రవెల్లి అమరుల కుటుంబాల పరిశీలన, ఇంకా అనేక యాత్రలు ఆయనకు సమాజం పట్ల ఉన్న అనురాగాన్ని, బాధ్యతను, కర్తవ్యాన్ని తెలియజేస్తాయి.

**గాత్రం – గానం – గాఢత;**

నాగభూషణం గారి పాటలు ఒక ప్రత్యేకత. ఆయన గొంతు ఎంత ఆర్ద్రంగా, మృదువుగా ఉంటుందో, ఆయన పాటలు అంత పదునుగా, శక్తివంతంగా ఉంటాయి. ఆయన పాడిన తెలంగాణ ఉద్యమ పాటలు సీడీ రూపంలో వెలువడి ప్రజాదరణ పొందాయి.ఆయన ఉద్యమకారుడే కాదు, ఉత్తమ ఉపాధ్యాయుడు కూడా. పిల్లల కోసం రచనలు చేసి, విద్యార్థులను ప్రేరేపించారు. తన వృత్తినిబద్ధతతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

**పదవులు – బాధ్యతలు – అంకితభావం;**

నాగభూషణం గారు కరీంనగర్ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక పదవులు చేపట్టారు. కానీ ఆయనకు పదవులు అలంకారం కాదు. ఆయన ఉన్నతమైన స్ఫూర్తి, అంకితభావం వల్ల ఆ పదవులే ఆయనకు అలంకారమై నిలిచాయి.బొమ్మలగుట్ట పరిరక్షణ నుండి బమ్మెర పోతన సమాధి, పాల్కురికి సోమనకవి, పోతన అస్తిత్వ పరిరక్షణ దాకా అనేక ఉద్యమాలకు ఆయనే ముందుండి మార్గదర్శకుడిగా నిలిచారు.గాజోజు నాగభూషణం గారి జీవితం పారదర్శకతకు, ప్రజాస్వామ్యానికి, సమాజ సేవకు ప్రతీక. పదవీ విరమణ తరువాత కూడా ఆయన తన ఉద్యమపరమైన, సాహిత్యపరమైన, సాంస్కృతికపరమైన సేవలను కొనసాగించాలి. కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, ఉద్యమకారుడిగా ఆయన మరిన్ని అద్భుతమైన రచనలు చేసి ముంద తరాలకు ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## ఎవరో మరి...

తెల్లవారుజామున ఎవరో మరి...వచ్చి
నా ఇంటి చిన్నతలుపును తడుతున్నారు,
ఎవరో వచ్చి తలుపును తడుతున్నారు;
ఇది నిశ్చయం,అనుమానం లేదు,లేదు,లేదు!
నే నది విన్నాను, తలుపు తీశాను,
నేను కుడి,ఎడమ వైపులకూ చూశాను,
ఇంకా చీకటిగానే ఉన్న ఉషోరాత్రిలో
అక్కడేమీ కలకలకోలాహలం లేదు;
బీటిల్ పురు గొకటి మాత్రమే గోడపై
తీరికలేకుండా అదేపనిగా టకటకా కొడుతూ ఉంది,
అడవి నుండి గుడ్లగూబ బిగ్గరమైన అరుపు వినిపిస్తోంది,
పొగమంచు బిందువులు రాలిపడుతూన్నవేళ
చిమ్మెట కీచుమంటూ ఈల వేస్తోంది,
మరి ఎవరువచ్చి తలుపును తడుతున్నారో
నాకేమీ తెలియదు అంతే,అంతే,అంతే!!!

ఆంగ్లమూలం: వాల్టర్ డెలా మేర్
స్వేచ్ఛాకవితానువాదం:
రఘువర్మ, 9290093933

## నన్ను మాట్లాడించకండీ..

మౌనంగా వుండీ
నన్నునేను ఎంతోకొంత
దాచుకుందామనుకుంటా

నన్ను నామాటల్ని
వాటిని అంటిపెట్టుకున్న
అంతర్గత ఆనవాళ్లని
కొల్లగొట్టటానికి
పురివిప్పిన ప్రేమై
నెమిలీకలతో సుతారంగా
స్పృశిస్తారు మీరు
దేహం పులకించినా
గుమ్మనంగా వుండిపోతాను
గుట్టుచప్పుడు కాకుండా
మనసును భద్రపరుచుకుంటాను
ప్రేమకు పదాల
పరం పరలెందుకనుకుంటాను

హృదయాన్ని చీల్చే
మాటల ముల్లు గర్రలు
మళ్లీ విఘాతం కల్గిస్తాయి
అగ్నిపర్వతం నుంచీ
ఎగిసిపడే నిప్పురవ్వలు
లావలా పరుచుకుంటున్న
లోలోని అలజడులు

నన్ను నేను ఎంత కప్పేసుకున్నా
కవచాలన్నీ రెప్పపాటులో ఎగిరిపోతాయి
ఉన్నది ఉన్నట్టుగా దిగంబరంగా
నన్ను నిలబెడతాయి

నన్ను మాట్లాడించకండీ
మాటే మనిషి తత్వం
మాటే మనసు కవిత్వం
మాటే ముసుగేయలేని మూర్తిమత్వం
మాటే హృదయ వారధి
మాటే నన్ను నడిపే సారథి అంటూ
మొర పెట్టుకుంటాను
ప్రకృతీ సహకరించదు
పంచేంద్రియాలూ సహకరించవు

బడ బడా పదాలు పదాలుగా
స్వరపేటికను చీల్చుకొని
గాల్లోనే రెక్కలు కట్టుకొని
స్వేచ్ఛావచనాలై
పచ్చని చెట్లపై వెచ్చని మెట్లపై
వాలిపోతాను

కొమ్మలు రెమ్మలూ
పూలూ కాయలు అన్నీ
మాటల మూటల్ని తగిలించుకొని
బరువెక్కి భూమ్మీదికి వంగుతాను
శబ్దపల్లవులు కాళ్లు తొడుక్కుని
గబ గబా గగనపు మెట్లెక్కేస్తాయి
ప్రపంచమంతా
పక్కున నవ్వేస్తూ
ఇదేకాదా నువ్వు అనేస్తుంది..!

- డా.కటుకోఝ్వల రమేష్
994903327


# రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946



# పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను
రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు
పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# పదోన్నతులతో బాధ్యతలు పెరుగుతాయి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన యం సాంబ రెడ్డి, పి జైపాల్, పి లక్ష్మారెడ్డి, డి వెంకటేశ్వర్లు, యం సాంబయ్య, కె వెంకన్న, డి సమ్మిరెడ్డి, యం లక్ష్మీ నారాయణ, పి శ్రీనివాస్ రాజు, ఎస్. సదయ్య లు అదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన ఎస్ఐలకు సూచించారు.

# రేబిస్ వ్యాధిపై సరైన సమాచారాన్ని ప్రజలకు అందించాలి

## వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కమిషనర్




**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ పర్యవేక్షణలో బాలసముద్రంలోని పెట్ పార్క్ లో డాగ్స్ బ్రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ రేబిస్ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హాజరయ్యి రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజలలో పశుప్రేమ, పశు ఆరోగ్యం పై అవగాహన పెంపొందించాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల పై ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడం ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ బస్తీ ఉత్సవం



**వరంగల్ మహా;** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా పోచమ్మ మైదాన్ బస్తీ ఉత్సవం కేఆర్ గార్డెన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ ఐటిటిఐ కార్యక్రమానికి సీకేఎం కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ గుమ్మడవెల్లి శశిధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ప్రధాన వక్తగా విచ్చేసిన వరంగల్ మహా నగర కార్యవాహ బుధారపు పృధ్వీరాజ్ మాట్లాడుతూ సంఘ్ ప్రారంభం ఎలా జరిగింది ఎందుకు జరిగిందో వివరిస్తూ 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో సంఘ్ తీసుకున్న పంచ్ పరివర్తన గురించి వివరిస్తూ కుటుంబం విలువలతో కూడినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని తద్వారా దేశం శ్రేష్ఠ స్థానంలోకి వెళ్తుందని క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు,రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పరివార్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహాచండి దేవిగా అమ్మవారి అలంకారణ



**ఆమనగల్లు, మహా:** అమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ మహాచండి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు విజ్ఞయ్ శర్మ ఆధ్వర్యంలో ఎంగలి చందన శ్రీధర్, దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, కార్యదర్శి అవ్వారి శివలింగం,కోశాధికారి గాజుల సత్యరాములు,యువజన సంఘం అధ్యక్షుడు. మామిడిశెట్టి రవి, ప్రధాన కార్యదర్శి చెరుకు రవి,కార్యదర్శి గుద్దేటి మహేష్ నేత,మహిళ సంఘం అధ్యక్షురాలు.అప్పం అలివేలు,పద్మశాలి సంఘం నాయకులు అప్పం శ్రీను,భీమానపల్లి దుర్గయ్య,ఎంగలి యాదగిరి, మసున గిరి,మసున మురళీధర్, ఎంగలి ప్రసాద్,ఎంగలి శ్రీధర్,గుర్రం భద్రయ్య,గుద్దేటి నిరంజన్,చిలివేరి వాసు,కోట అశోక్,పాలది శ్రీను, కోట రాఘవేందర్,చెరుకు యాదయ్య,కోట నారాయణ,చెరుకు తిరుమలేష్,సిరందాసు గోపి,కోట వివేక్,గుజ్జరి ప్రవీణ్,గుర్రం సురేష్,అరుగొండ మధు,బావాండ్ల శంకర్,సిరందాసు నగేష్,గోలి శ్రీను,మసున శ్రీను,పున్న శ్రీను,బావాండ్ల రమేష్,గుద్దేటి శివ,మహిళలు ,భక్తులు,పద్మశాలి సంఘంనాయకులు,ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మదీనా తుల్ మదర్సాలో ప్రత్యేక ప్రార్థనలు



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలో ఉన్న జామియా నిజాం మియా మదీనా తుల్ మదర్సాలో ఆదివారం ఖాతేమీ ఖురాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముస్లింసోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మదరసా చైర్మన్ ఖామరుద్దిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు దువా కార్యక్రమం చేపట్టారు. మదర్సా అధ్యక్షులు జహంగీర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేసి మదర్సా విద్యార్థులతో పాటు ముస్లిం సోదరులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు మాసుమ్,జబ్బర్, ఆర్టీసీ జలాల్, నయూమ్, మజీద్ ఖురేషి, బురాన్, రెక్సిన్ జాంగిర్, ఖలీద్ , ఇమ్రాన్ షెనివాజ్ ,ఏసాన్, ఉసామా, తదితరులు ఉన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి, హైదర్ గూడ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో, దేవి నవరాత్రులో భాగంగా బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోలాన్ సుభాన్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టి నరేందర్, రామేశ్వరరావు, రావుల జంగయ్య, పుల్లారెడ్డి, హరినాథ్, ముఖేష్, బాలసుబ్రమణ్యం, ఎస్ వెంకటేష్, రాము యాదవ్, తదితరు పాల్గొన్నరు.



# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కుమారి దీపక్ తెలిపారు. ఆదివారం చెన్నూరు మండలం సుద్దాల గ్రామంలో గల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి యామిని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి ఆకస్మికంగా సందర్శించి యూరియా నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖల సమన్వయంతో జిల్లాలోని రైతులందరికీ పంట సాగుకు అవసరమైన యూరియా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, సాగుకు అవసరమైన యూరియా తీసుకొని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ముందస్తు సాగుకు, అవసరానికి మించి యూరియా తీసుకోకూడదని, యూరియా పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సాగు చేస్తున్న రైతులకు సమయానుకూలంగా యూరియా అందించడం జరుగుతుందని, ఈ మేరకు రైతులు సహకరించాలని తెలిపారు. అంతకుముందు చెన్నూరు మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, సర్వే ల్యాండ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి హాజరయ్యారు. ప్రభుత్వం త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు ఇతర సంబంధిత ఎన్నికల అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు శిక్షణలో అందించిన అంశాలను నేర్చుకుని ఎన్నికల నిర్వహణలో ఖచ్చితంగా వ్యవహరించాలని, ప్రక్రియ నిర్వహణలో అనుమానాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## కంది శ్రీనివాస రెడ్డి

- డాల్డా కంపెనీ కాలనీలో భారీ చేరికలు
- కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేరిన కాలనీ వాసులు
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి
- మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపు




**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీ గరీబోళ్ల పార్టీ అని ఎప్పుడు కూడా పేదల సంక్షేమం కోసమే పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 44వ వార్డు లోని డాల్డాకంపెనీ కాలనీ లో రఫీక్ , సలీం ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కాంగ్రెస్ శ్రేణులు కాలనీ వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పని చేస్తూ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తూ పేదల సొంతింటి కల తీరిస్తే ఎమ్మెల్యే పాయల్ శంకర్ అవి బీజేపీ ఇస్తున్నట్టుగా చెప్పుకుంటున్నాడని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటే పేదల గురించి ఆలోచించి పని చేస్తుందన్నారు. పేదలకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా సన్న బియ్యం ఇస్తుందన్నారు. కేంద్రం గ్యాస్ సిలిండర్ ధరను వెయ్యికి పైగా పెంచితే మన ప్రభుత్వం సబ్సిడి భరించి పేదలకు ఐదు వందలకే అందిస్తుందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ , కొత్త రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. తన గరీబోళ్ల పక్షమని పేదలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి సిద్దంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీని,తనను నమ్మి చేరుతున్న వారందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు.అందరికి అండగా ఉంటానని ఎళ్లవేలలా అందుబాటులో ఉంటానని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపించుకోవాలని అందరం కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్ట సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,ఇమ్రాన్ , ఖిజర్ పాషా, గిమ్మ సంతోష్ రావు, కోలా నరసింహులు, లోక ప్రవీణ్ రెడ్డి, ప్రశాంత్, పోతారెడ్డి, ఎంఏ షకీల్, రఫీక్ ,ఖలీం, నరేష్, శరత్,కొండూరి రవి, మానే శంకర్, ఇర్ఫాన్, ఖమర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువుల నుండి సోకే రెబీస్ వ్యాధిని అరికట్టాలి

## బెల్లంపల్లి పశువైద్యాధికారి డాక్టర్ దిలీప్



**బెల్లంపల్లి,మహా:** పెంపుడు జంతువుల కుక్కలు పిల్లుల నుండి సోకే రెబిస్ వ్యాధిని అరికట్టాలని బెల్లంపల్లి పశువైద్యాధికారి డాక్టర్ దిలీప్ పేర్కొన్నారు వెల్లడించారు. ఆదివారం రోజు ప్రపంచ రేబిస్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం పెంపుడు జంతువులనుండీ మానవులకు సంక్రమించేవ్యాధులను అరికట్టేందుకు టీకాలను వేస్తుందని ఈ అవకాశాన్ని పెంపుడు జంతువులను పెంచే యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు కుక్కలను పిల్లలను తీసుకొని ఆస్పత్రి ఆవరణలో టీకాలువేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తిరుపతి శ్రావణ్ ప్రశాంత్ వెంకటేష్ నవీన్ లు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణి రద్దు

## జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (29.09.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్దుల బతుకమ్మ పండుగ ఉన్నందున రద్దు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి నేడోక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్ కు రావద్దని ఆమె కోరారు.

# అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

## చిన్నారుల భరతనాట్యాన్ని ఆస్వాదించిన, కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి



**రాజేంద్రనగర్, మహా ;** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ పద్మశాలిపురం బుద్వేల్, పలు కాలనీలలో అమ్మవారి మండపాలలో ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీలలో చిన్నారుల కోసం భరతనాట్యం పోటీలను మండపం నిర్వాహకులు నిర్వహించారు. గెలుపొందిన చిన్నారులను అభినందిస్తూ సత్కరించారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ దేవి శరన్నవరాత్రి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యూత్ అసోసియేషన్ సభ్యులు, గజ్జల కృష్ణ యాదవ్, మహేందర్, సత్తి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రంజీస్, పావని, నరేష్ గౌడ్, బ్రహ్మణి, భావన, మనీషా, సంహిత, ఆద్య శ్రీవల్లి, ప్రణవి, జాహ్నవి, రస్మిత కిశిఖ, క్రిత్విక, రోహి, ప్రేరణ, బబ్లూ, ఏన్ను శంకర్ రెడ్డి మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాత అమ్మవారి మండపాలల్లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని పలు దుర్గామాత మండపాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దూది వెంకటాపురం, రఘునాధపురం, రాజపేట పట్టణం, రేణిగుంట గ్రామం ,బేగంపేట గ్రామం, కుర్రారం గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వచ్చిన భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాఘవపురం గ్రామంలో ఆదివారం నాడు దండ్ల నరేష్ చందన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యాతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ఆ ఇంట్లో పాలు పొంగిచారు ఈ సందర్భంగా ఆ లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముందుగా ఇచ్చిన మాట ప్రకారం పట్టుబట్టలు, యటాను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ MPTC ఆరె ప్రశాంత్ తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర రాజు,నాయకులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుర్రారం చెరువులో బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువగిరి జిల్లా రాజపేట మండలం కుర్రారం గ్రామ చెరువులో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత కొన్ని ఏళ్లుగా చెరువు యొక్క మత్తడి కూలిపోవటంతో చెరువు నిండి నీరు నిల్వ లేదు. ఈ నేపథ్యంలో బీర్ల అయిలయ్య సహకారం తో చెరువు అలుగు వద్ద మట్టితో కట్టను వేయంచారు దీంతో నీరు బయటకు వెళ్లకుండా చెరువు నిండు కుండాలగా మారి కళకళ లాడుతుంది. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతుల తో కలిసి బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేశారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు...

## భగత్ సింగ్ ఆలోచనలకు విరుద్ధంగా బిజెపి విధానం.. భగత్ సింగ్ ఆలోచనలతో ఉద్యమిద్దాం: చరణ్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా మహా:** భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమిద్దామని, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్ పేర్కొన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల ప్రాయంలోనే, ఉరి కొయ్యకు ప్రాణాలర్పించిన వీర కిషోరం భగత్ సింగ్ అని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భగత్ సింగ్ ఆలోచనలకు విరుద్ధంగా మతోన్మాద విధానాలతో తినే తిండి, కట్టే బట్టపై ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను కనుమరుగు చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సభ్యుడు మాల చందు, ఉపాధ్యక్షుడు యశ్వంత్, నాయకులు విష్ణు గుప్తా, ఇర్ఫాన్, ప్రశాంత్, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు నడుద్దాం...

## బీజేపీ అధ్యక్షులు సూరె రెడ్డి



**రాజేంద్రనగర్, మహా ;** భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమిద్దామన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా మైలార్దోపల్లి డివిజన్ అధ్యక్షులు సూరే రెడ్డి వినయ్ రెడ్డి, భగత్ సింగ్ చిత్రపటానికి పూమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల నునుగు మీసాల వయసులోనే, ఉరి కొయ్యకు ప్రాణాలర్పించిన వీర కిషోరం భగత్ సింగ్ అని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భగత్ సింగ్ ఆలోచనలతో ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు అడికే రాజు, నరసింహ రాజు ,జగన్, వెంకటరమణ గుప్తా, రామారావు, కిరణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.





# జిమ్ ప్రారంభోత్సవంలో కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** ఆరోగ్యం మహాభాగ్యమని మానసిక ,శారీరక ధృడత్వానికి జిమ్ చేయడం ఎంతో అవసరమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రాంనగర్ లోని ఇంపాక్ట్ ఫిట్నెస్ జిమ్ సెంటర్ ను ఆయన సందర్శించారు. యజమానూలు షాకీర్, జీషాన్ లకు అభినందనలు తెల్పుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం జిమ్ లోని వ్యాయామ పరికరాలను పరిశీలించారు. జిమ్ సెంటర్ ట్రైనర్ ఆయనకు అన్ని వివరించారు.. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,ఇమ్రాన్ , గుడిపెల్లి నగేష్, గిమ్మ సంతోష రావు, కోలా నరసింహులు, షేఖీల్,ఖలీం, అర్భాత్ ఖాన్, సలీం, శరత్, నరేష్.. తదితరులు పాల్గొన్నారు.

# భవానీ మాత ఆలయంలో కంది శ్రీనివాస రెడ్డి ప్రత్యేక పూజలు





**ఆదిలాబాద్ మహా :** దేవీ శరన్నవ రాత్రోత్సవాలు, బతుకమ్మ సంబరాలలో భాగంగా బేల మండల కేంద్రంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పర్యటించారు. మండలం లోని భవాని గూడ లో గల భవాని మాత ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. ప్రజలందరు ఆయురారోగ్యాలు సంఖ సంతోషాలతో సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్,డైరెక్టర్ మడావి చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి,ఠాక్రె అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఘన్శ్యామ్, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు విట్టల్ దేవతడే,నానాజీ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఠాక్రె అశోక్ పాటిల్,సుదాం రెడ్డి, బండి సుదర్శన్, ఇట్టడి రాజా రెడ్డి,బండి నందు, రమేష్ పాటిల్, బొక్రె శంకర్,వాంఖడే రుప్ రావ్, విపిన్ ఠాక్రె, ఈశ్వర్ దొటే, తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు..



# కంది శ్రీనివాస రెడ్డికి గోవారి కులస్తుల వినతి పత్రం

**ఆదిలాబాద్ మహా :** తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని బేలా మండలం లోని పలు గ్రామాలకు చెందిన గోవారి కులస్తులు కోరుతున్నారు.ఆదివారం బేల మండలంలోని మసాల బీ గ్రామంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డిని కలిసి తమ గోడు చెప్పుకున్నారు. ఎన్నోఏళ్లుగా ఇక్కడే గోండ్ ఆదివాసీలతో కలిసి నివాస ముంటున్న తమను ఎస్ టి జాబితాలో చేర్చాలని కోరుతూ కంది శ్రీనివాస రెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పెద్దల దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, డైరెక్టర్ మడావి చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి,ఠాక్రె అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఘన్శ్యామ్, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు విట్టల్ దేవతడే,నానాజీ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఠాక్రె అశోక్ పాటిల్,సుదాం రెడ్డి, బండి సుదర్శన్, ఇట్టడి రాజా రెడ్డి,బండి నందు, రమేష్ పాటిల్, బొక్రె శంకర్,వాంఖడే రుప్ రావ్, విపిన్ ఠాక్రె, ఈశ్వర్ దొటే, తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే
# ఆర్ఎస్ఎస్ లక్ష్యం

**ఆమనగల్లు,మహా :** వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ ఎస్ ఎస్ ఆమనగల్లుశాఖ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు . కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొని ఆయన ప్రసంగించారు. 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు, హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని పేర్కొన్నారు, హిందుత్వం జీవన విధానం, విశ్వ శాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ,పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు.

## ఖిలా వరంగల్‌లో అంబరాన్ని అంటిన
# బతుకమ్మ సంబరాలు



**వరంగల్, మహా;** వరంగల్ జిల్లా యంత్రాంగం, మహా నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ లో ఆదివారం నిర్వహించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిధిగా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖ హాజరు కాగా, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, మహిళ ఉద్యోగులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని తంగేడు పూలు, గునుగు పూలు, బంతిపూలు, చామంతులతో అందంగా పేర్చి మహిళలందరూ ఒక చోట కూడి చప్పట్లతో నృత్యాలు చేస్తూ ఆడి పాడి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మహిళలతో కలసి స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక విశిష్టతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను, రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాల్లో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు, ఈ వేడుకలు మన వరంగల్ పట్టణంలో చారిత్రక వేయ్యి స్తంభాల గుడి నుండి ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. బతుకమ్మ అనేది కేవలం పూల పండుగ కాదని-ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, భూదేవికి సమర్పించే నైవేద్యమని,ఇది తల్లి, చెల్లి, అమ్మాయిల ప్రతి మదిలో మెదలే గౌరవానికి నిలువెత్తు గుర్తని మంత్రి అన్నారు. సంప్రదాయం ఆధునికతల మేళవింపుగా, సంస్కృతి, ప్రకృతి, పర్యాటకంతో మమేకమయ్యేలా, సకల జనుల సమ్మేళనంతో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.9 రోజులు అమ్మవారిని కొలుసుకుంటామని అన్నారు. బతుకు చైతన్యం - బతుకమ్మ ఆరాధనం" అన్నట్లుగా, ఇది తెలంగాణ ఆడబిడ్డల గొంతులో ఊసెత్తే ఉయ్యాల పాట అన్నారు. బతుకమ్మ వెనక సైంటిఫిక్ రీసన్ ఉందని ఎన్నో ఔషధ గుణాలున్న బతుకమ్మ పూలతో చెరువులు శుద్ధి అవుతాయి. తంగేడు, గునుగు, కట్ల పూలు యాంటీ బయోటిక్. పంటలిచ్చిన చెరువులను మొక్కుకోవడం బతుకమ్మ ఆచారం. తాగునీళ్లు కూడా గతంలో చెరువులు ఇచ్చేవి. చెరువులకు కృతజ్ఞతా భావం తెలపడమే బతుకమ్మ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. మన ఘనత ప్రపంచం మొత్తం తెలిసేలా, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు అయ్యేలా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించబోయే బతుకమ్మ పండుగను ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్నామని ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మంత్రి ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.



## క్రీడలతో ఆరోగ్యం,
# ఆనందం సాధ్యం

**ఆమనగల్లు,మహా:** క్రీడలతోఆరోగ్యం,ఆనందంసాధ్యమవుతుందని చరికొండ గ్రామ యువత పేర్కొన్నారు.. ఆదివారం కడ్తాల్ మండల పరిధిలోని చరికొండ గ్రామంలో చిన్నా నాటి మిత్రుని జ్ఞాపకార్థం నిర్వహించిన చరికొండ క్రికెట్ టోర్నమెంటును తోటి మిత్రులు ఏర్పాటు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులు టోర్నమెంట్లను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక నేతలు సూచించారు. అనంతరం క్రికెట్ కిట్స్ అందజేసిన స్పాన్సర్లను శాలువులతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్పాన్సర్ గాదమోని శేఖర్, రాము,అద్దాల మహేందర్,గౌని వెంకటేష్, లింగం, హరిచంద్ర, రాజేష్, శ్రీశైలం, భీష్మ,నరేష్,సచిన్, పాల్గొన్నారు



# బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లాలోని బేల మండలం మసాల బీ గ్రామంలో జరిగిన బతుకమ్మ సంబరాలలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహపరిచారు. అంతకు ముందు గ్రామానికి చెందిన పలు సమస్యలపై చర్చించారు. ఏసమస్య వచ్చినా గ్రామస్తులకు తాను అండగా ఉంటానని కంది శ్రీనివాస రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్,డైరెక్టర్ మడావి చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి,ఠాక్రె అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఘన్శ్యామ్, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు విట్టల్ దేవతడే,నానాజీ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఠాక్రె అశోక్ పాటిల్,సుదాం రెడ్డి, బండి సుదర్శన్, ఇట్టడి రాజా రెడ్డి,బండి నందు, రమేష్ పాటిల్, బొక్రె శంకర్,వాంఖడే రుప్ రావ్, విపిన్ ఠాక్రె, ఈశ్వర్ దొటే, తదితరులు పాల్గొన్నారు.



## నూతన విశ్వకర్మ సంఘం
# ఎన్నిక ఏకగ్రీవం

### అధ్యక్షులుగా మాధవచారి

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విశ్వకర్మ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో విశ్వకర్మ సంఘం అధ్యక్షులు ఆంధ్రప్రభ రిపోర్టర్ పెద్దోజి మాధవచారి బాధ్యతలు చేపట్టగా, ఉపాధ్యక్షుడిగా కమ్మరి ప్రకాష్ చారి, జనరల్ సెక్రటరీగా పెద్దోజు సుదర్శన చారి, జాయింట్ సెక్రటరీగా పెద్దోజు అరవింద్, కోశాధికారులుగా కమ్మరి పాండు చారి, ఏ. గౌతమ్ చారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కమ్మరి నరసింహ చారి, పి. శ్రీశైలం చారి, కే. ప్రభు చారిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షులు పెద్దోజి మాధవచారి మాట్లాడుతూసభ్యుల విశ్వాసానికి తగిన విధంగా సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమాజంలో విశ్వకర్మ వర్గం మరింత బలపడేలా కృషి చేయడం నా ప్రధాన ధ్యేయం అన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కొత్త కమిటీకి హార్దిక అభినందనలు తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణ
# ప్రతి ఒక్కరి బాధ్యత

**ఆమనగల్లు, మహా:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ ప్రెసిడెంట్ సీత రావ్ , సెక్రటరీ నరసింహన్, స్వీడన్ దేశస్తులు జాన్ బుచ్ అందర్సన్, ఓయికన్ పీటర్ వీరనారి చాకలి ఐలమ్మ కళాశాల ప్రియ కుమారి పేర్కొన్నారు.ఆదివారం కడ్తాల్ కడ్తాల్ మండల పరిధిలోని ది ఎర్త్ సెంటర్ ని సందర్శించారు.ఈ సందర్భంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఫౌండర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన, సాత్విక ఆధ్వర్యంలో శ్రీ రామేశ్వర వీరాంజనేయ స్వామి జ్ఞాన సరస్వతి క్షేత్రంలో మొక్కలు నాటారు..మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మొక్కల సంరక్షణ తోనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందడమే కాకుండా సకాలంలో వర్షం కురుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ సంస్థ సభ్యులు విజయ లక్ష్మి, లీలా ఆలయ కమిటీ సభ్యులు రాజు గౌడ్,శేఖర్, రజనీకాంత్,శివ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ బాకీ కార్డు బీఆర్ఎస్‌కు బ్రహ్మాస్త్రం

### ఇంటింటికీ పంపిణీ చేసి ప్రభుత్వ తీరును ఎండగడతాం

### కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాష్ట్రంలో పనులు చేపట్టడం లేదు

### అచ్చంపేట జన గర్జన సభలో మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు




**అచ్చంపేట, మహా:** కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు బీఆర్ఎస్‌కు బ్రహ్మాస్త్రంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాటలు వింటుంటే నవ్వొస్తోందని అన్నారు. కాంగ్రెస్ మంత్రులు తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందో లేదో అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనగర్జన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. అచ్చంపేట నుంచి జైత్రయాత్ర మొదలుపెడుతున్నామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. గతంలోనే తాము ఆల్మట్టి ప్రాజెక్ట్ ఎత్తు పెంపును అడ్డుకున్నామని గుర్తు చేశారు. మళ్లీ పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపడితే నల్లమల పులిబిడ్డగా చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తారో చూడాలని ఎద్దేవా చేశారు. గతంలో ఆర్డినెన్స్‌పై గట్టిగా హెచ్చరించిన పులి మాజీ సీఎం కేసీఆర్ అని కేటీఆర్ గుర్తు చేశారు. ఆల్మట్టిని అడ్డుకునే దమ్ముంటే రాహుల్ గాంధీతో చెప్పి కర్ణాటక సీఎంను పిలిపించి ఎత్తును అడ్డుకోవాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి నల్లమల పులికాదు.. నల్లమల నక్క.. అని విమర్శించారు. పెంచుతామన్న పెన్షన్లు, మహిళలకు ఇస్తామన్న రెండున్నరవేలకు మొండిచేయి చూపారని ఆరోపించారు. మోసపోతే గోస పడతామని కేసీఆర్ ఆనాడే చెప్పారు.. కాంగ్రెస్ బాకీ కార్డును ఇంటింటికీ పంపిణీ చేసి ప్రభుత్వ తీరును ఎండగడతామని ధీమా వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఏమయ్యిందని నిలదీశారు. మోసపోతే గోస పడతామని కేసీఆర్ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు యూరియా విషయంలో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. సన్నవడ్లకు బోనస్ అనేది బోగస్ అయ్యిందని విమర్శించారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి తాము శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు చేయటానికి రేవంత్ రెడ్డికి చేతకావటం లేదని ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే పనులు చేపట్టడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీకి భయపడి ఆల్మట్టిపై రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మండిపడ్డారు. రాష్ట్రానికి పెద్ద మనిషి అయిన సీఎం రేవంత్ రెడ్డి తమకు అప్పు పుట్టడం లేదని చెప్పటం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. త్వరలో అచ్చంపేటకు మంచి నాయకుడిని నియమిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మందమర్రిలో టిడిపి మహిళలకు చీరల పంపిణీ



**మందమర్రి, మహా :** మందమర్రిలో తెలుగుదేశం పార్టీ (టిడిపి) పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుండి మహిళల పక్షపాతిగా వ్యవహరించిందని అన్నారు. డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు తెలుగుదేశం ఆధ్వర్యంలోనే జరిగిందని వెల్లడించారు. తన శక్తి మేరకు చెన్నూరు నియోజకవర్గంలో పార్టీ మహిళలకు చేనుల పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్, మహిళ పట్టణ అధ్యక్షురాలు జూపాక సంధ్య, గౌరవ అధ్యక్షురాలు జయ (సుకన్య), సామ కవిత, సుగుణ, భాగ్య, కారం రాజు, ఒడ్నాల సత్యనారాయణ పారిపల్లి శ్రీను, రాజేష్ లు ఉన్నారు.



# బతుకమ్మ ఘాట్ ధ్వంసం.. ధర్నా

**ఆమనగల్లు, మహా:** మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలోని బతుకమ్మ ఘాటును తన స్థలమే అంటూ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం బతుకమ్మ ఘాట్ లోని ఓ వ్యక్తి మర్రిచెట్టును తొలగించడంతో పాటు దిమ్మెను ధ్వంసం చేశారని తెలిపారు. గతంలో ఈ స్థల వివాదంలో గొడవలు జరిగి కేసులు నమోదై కోర్టు పరిధిలో ఉండగా మళ్లీ గొడవకు తెర లేపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కారు బైక్ ఢీకొని యువకుడి మృతి

**ఆమనగల్లు, మహా:** కారు బైక్ ఢీకొని యువకుడి మృతి చెందినట్లు ఆమనగల్లు ఎస్ ఐ వెంకటేష్ తెలిపారు. అమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతావత్ వినోద్(28) అనే యువకుడు మృతి చెందాడు. అమనగల్లు మండలం పాపర్లబోడు తండాకు చెందిన కేతావత్ వినోద్ బైకుపై తండా నుంచి ఆమనగల్లు వైపు వెళుతుండగా హైదరాబాద్ నుంచి అచ్చంపేట వెళ్తున్న వాహనం ఎదురుగా ఢీకొనడంతో బైక్ పై వెళ్తున్న వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు.కాగా రోడ్డు ప్రమాదంలో మృతుడి బంధువులు తండా వాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో ఇరువైపుల కిలోమీటర్ మేర అరగంట పాటు భారీగా ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ వెంకటేష్ తెలిపారు.



# ఇళ్ల అమ్మకాలు డీలా

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 9 శాతం మేర తక్కువగా ఉంటాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ అంచనా వేసింది. 97,080 యూనిట్ల విక్రయాలు నమోదు కావొచ్చంటూ క్యూ2పై ఇప్పటి వరకు ఉన్న గణాంకాల ఆధారంగా ఒక నివేదికను విడుదల చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 1,07,060 యూనిట్లుగా ఉన్నాయి. కానీ, విలువ పరంగా 1.52 లక్షల కోట్ల విక్రయాలు ఉంటాయని, క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాల విలువ రూ.1.33 లక్షల కోట్లతో పోల్చి చూస్తే ఇది 14 శాతం అధికమని పేర్కొంది. ప్రీమియం, లగ్జరీ ఇళ్ల విభాగంలో లావాదేవీలు పెరగడం మొత్తం మీద సెప్టెంబర్ త్రైమాసికంలో విక్రయాల విలువ వృద్ధికి కారణమని అనరాక్ నివేదిక తెలిపింది. సరఫరా కంటే విక్రయాలే అధికంగా ఉన్నట్టు అనరాక్ చైర్మన్ అనుజ్‌పురి తెలి పారు. రియల్ ఎస్టేట్ మార్కెట్లో పరిస్థితి సానుకూలంగా ఉన్నట్టుగా ఇది తెలియజేస్తోందన్నారు.

**హైదరాబాద్‌లో 11,305 యూనిట్లు**

- హైదరాబాద్ మార్కెట్లో సెపెటెంబర్ త్రైమాసికంలో అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 11 శాతం తగ్గి 11,305 యూనిట్లుగా ఉంటాయన్నది అనరాక్ అంచనా. క్రితం ఏడాది ఇదే కాలంలో 12,735 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.
- బెంగళూరులో ఒక శాతం తక్కువగా 14,835 యూనిట్ల విక్రయాలు జరగొచ్చు.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 13,920 యూనిట్లు అమ్ముడుపోవచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 11 శాతం తక్కువ.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 16 శాతం తగ్గి 30,260 యూనిట్ల అమ్మకాలు నమోదు కావొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో 36,915 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- పుణెలో 16 శాతం క్షీణతతో 16,620 యూనిట్లు అమ్ముడుపోవచ్చు. కోల్‌కతాలో 4,130 యూనిట్ల విక్రయాలు జరగొచ్చన్నది అనరాక్ వేసిన అంచనా. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇక్కడ 3,980 యూనిట్ల అమ్మకాలతో పోల్చి చూస్తే 4 శాతం అధికం.
- చెన్నైలోనూ 33 శాతం అధికంగా 6,010 యూనిట్ల అమ్మకాలు ఉంటాయని అనరాక్ నివేదిక పేర్కొంది.

# అక్కడ బంగారం ధర రూ.2.23 లక్షలు..!

ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్స్ కు 3,759 డాలర్ వద్ద ట్రేడవుతోంది. భారత్‌కు సరిహద్దున ఉన్న నేపాల్‌లోనూ బంగారానికి మంచి డిమాండే ఉంటుంది. దీంతో ఇక్కడ బంగారం ధర ప్రస్తుతం టోలాకు (11.66 గ్రాములు) రూ.2,23,200 (నేపాలీ రూపాయలు) లకు చేరింది. భారత రూపాయితో పోలిస్తే నేపాలీ రూపాయి విలువ తక్కువగా ఉంటుంది. ఒక్క భారత రూపాయి 1.6 నేపాలీ రూపాయలకు సమానం. ఇక భారత్ విషయానికి వస్తే బంగారం ధరలు (Gold Rate) గత వారం రోజులుగా స్థిరమైన పెరుగుదలను చూశాయి. కాలానుగుణ డిమాండ్, స్థూల ఆర్థిక అనిశ్చితి కారణంగా విస్తృత జాతీయ, ప్రపంచ ధోరణికి అనుగుణంగా పసిడి ధరలు ఎగిశాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలు సహా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.11,548 వద్ద ఉంది. ఇది వారం క్రితం ఉన్న రూ.11,215 తో పోలిస్తే రూ.333 పెరిగింది. అంటే తులానికి (10 గ్రాములు) రూ.3300 పెరిగి రూ.1,15,480 కి చేరింది. మరోవైపు 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.305 పెరిగి రూ.10,280 నుంచి రూ.10,585కు చేరుకుంది. వారం రోజుల్లో తులం బంగారం ధర ఏకంగా రూ.3050 పెరిగి రూ.1,05,850 లకు ఎగిసింది.






# కేపీఐ గ్రీన్‌కు ఎస్‌బీఐ నిధులు

## రూ. 3,200 కోట్లకు ఓకే..

పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ నుంచి ఫైనాన్స్ సౌకర్యాన్ని పొందినట్లు పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ కేపీఐ గ్రీన్ ఎనర్జీ తాజాగా వెల్లడించింది. దీంతో ఎస్‌బీఐ నుంచి రూ. 3,200 కోట్ల రుణాన్ని అందుకోనున్నట్లు తెలియజేసింది. సోలార్, హైబ్రిడ్ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ ప్రాజెక్టులకు ఎస్‌బీఐ రుణాలు సమకూర్చనున్నట్లు తెలియజేసింది. వీటిని గుజరాత్‌లో మొత్తం 1జీడబ్ల్యూపీ సామర్థ్యంతో ఏర్పాటు చేయనుంది. రెండు వ్యూహాత్మక పాజెక్టులకు ఈ రుణ సౌకర్యాలు మద్దతివ్వనున్నట్లు పేర్కొంది. 250 మెగావాట్ల(ఏసీ), 350 ఎండబ్ల్యూపీ(డీసీ) సోలార్ పవర్ ప్రాజెక్టుతోపాటు.. 370 మెగావాట్ల హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు వీటిలో ఉన్నాయి.

# హెచ్1బి వీసా రాని టెకీలకు కెనడా గాలం!




అమెరికాలో పనిచేస్తూ కొత్త ఫీజు, నిబంధనల కారణంగా హెచ్1బి వీసా (H1B Visa) పొందలేకపోయిన టెక్నాలజీ రంగ నిపుణలకు కెనడా దేశం గాలం వేస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) కొత్త వీసా ఛార్జీలకు ముందు యూఎస్‌లో పనిచేసిన టెక్ ఉద్యోగులను తమ దేశానికి ఆకర్షించాలనుకుంటున్నారు కెనడా ప్రధాని మార్క్ కార్నీ. తాజాగా లండన్‌లో విలేకరులతో మార్క్ కార్నీ మాట్లాడుతూ తమ ఆలోచనను బయటపెట్టారు. గతంలో హెచ్ 1బీ వీసాలు ఉన్న వారిని ఆకర్షించే అవకాశం స్పష్టంగా ఉందని కార్నీ వెల్లడించారు. అలాంటి వారిలో టెక్ రంగ ఉద్యోగులు చాలా మంది ఉన్నారని, వారంతా వేరే ప్రాంతానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. కొత్త హెచ్ 1బి వీసాలపై లక్ష డాలర్ల ఫీజు విధిస్తూ ట్రంప్ గత వారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై సంతకం చేశారు. ఇది కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఇంజనీరింగ్, ఇతర ఉద్యోగాల్లో ప్రపంచ ప్రతిభను తీసుకురావడానికి కొత్త హెచ్ 1బి ప్రోగ్రామ్‌పై ఆధారపడే కంపెనీలకు గందరగోళం, నిరాశను సృష్టించింది. కెనడా (Canada) ప్రభుత్వం తన ఇమ్మిగ్రేషన్ వ్యూహాన్ని సమీక్షిస్తున్నప్పుడు, ఈ రకమైన ప్రతిభావంతులైన నిపుణులను ఆకర్షించే అంశాన్ని గ్రహించడాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని, దానిపై "స్పష్టమైన సమర్పణ" ఉంటుందని కార్నీ చెప్పారు. హెచ్ 1బి వీసాలు చేజారి, అమెరికాలో పని చేసేందుకు అవకాశాలు కోల్పోయినవారిని పలు ఇతర దేశాలు కూడా ఆకర్షిస్తున్నాయి. జర్మనీ, యూకే వంటి దేశాలు నైపుణ్యం కలిగిన కార్మికులకు ప్రత్యామ్నాయ గమ్యస్థానంగా తమను తాము పేర్కొంటున్నాయి.



# ఆటో విడిభాగాలకు టారిఫ్‌ల దెబ్బ

**న్యూఢిల్లీ:** అధికస్థాయిలో యూఎస్ విధిస్తున్న టారిఫ్‌లు దేశీయంగా మొత్తం ఆటో విడిభాగాల తయారీని దెబ్బతీయనున్నట్లు రేటింగ్స్ సంస్థ ఇక్రా పేర్కొంది. ఇతర ఆసియా దేశాల ఎగుమతిదారులతో పోలిస్తే భారత్ నుంచి ఆటో విడిభాగాలను ఎగుమతి చేసే సంస్థలకు ఇది ప్రతికూలంగా పరిణమించనున్నట్లు తెలియజేసింది. ఇది భారత్, యూఎస్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద ప్రాధాన్యతను పట్టి చూపుతున్నట్లు పేర్కొంది. ఆటో విడిభాగాల పరిశ్రమ ఆదాయంలో 30 శాతం ఎగుమతులనుంచే లభిస్తున్నట్లు తెలియజేసింది. దీనిలో ఒక్క యూఎస్ నుంచే 27 శాతం సమకూరుతున్నట్లు వివరించింది. వెరసి ఇటీవల యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు దేశీయంగా మొత్తం ఆటో విడిభాగాల ఉత్పత్తిపై ప్రత్యక్షంగా 8 శాతం ప్రభావాన్ని చూపనున్నట్లు ఇక్రా తాజాగా అంచనా వేసింది. 15-30% టారిఫ్‌లను ఎదుర్కొంటున్న చైనా, జపాన్, వియత్నాం, ఇండొనేసియా తదితర ఆసియా దేశాలతో పోల్చితే భారత్ ఎగుమతిదారులకు ప్రతికూలమేనని తెలియజేసింది.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



# యూరప్ చుట్టూ డ్రోన్ గోడ



**బ్రసెల్స్:** రష్యా- ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో యూరప్ దేశాలు మరిన్ని ఆత్మరక్షణ చర్యలకు నడుం బిగించాయి. రష్యా డ్రోన్లు, యుద్ధ విమానాలు తమ గగనతలంలోకి ప్రవేశించిన ఘటనలు ఇటీవలి కాలంలో తరచూ చోటుచేసుకుంటుండటం ఈ దేశాలను మరింత అప్రమత్తం చేసింది. రష్యా, ఉక్రెయిన్‌లతో తమకున్న సరిహద్దు గగనతలాల్లో చోటుచేసుకునే ఉల్లంఘనలను సకాలంలో గుర్తించి, అడ్డగించేందుకు సమగ్ర రక్షణ వ్యవస్థ, డ్రోన్ వాల్‌ను ఏర్పాటు చేసుకోవాలని యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలు నిర్ణయించాయి. శుక్రవారం బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో జరిగిన ఈయూ రక్షణ మంత్రుల వర్చువల్ సమావేశం ఈ మేరకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇటీవల పెరిగిపోయిన గగనతల ఉల్లంఘనలపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీటిలో కొన్ని ఉల్లంఘనలకు రష్యానే కారణమంటూ దేశాలు నిందిస్తున్నాయి. అయితే, వీటికి తాము కారణం కాదని, ఉద్దేశపూర్వకంగా వీటిని ప్రయోగించామంటూ తమపై ఆరోపణలు వేయడం సరికాదని రష్యా అంటోంది. సభ్య దేశాల గగనతలంలోకి ప్రవేశించే రష్యా డ్రోన్లు, యుద్ధ విమానాలను కనిపించిన వెంటనే కూల్చేయాలంటూ నాటోకు ఆదేశాలిచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. చొరబాటు ఘటనలను నివారించేందుకు డ్రోన్ వాల్/ డ్రోన్ షీల్డ్ మాత్రమే సరైన పరిష్కారమనే అభిప్రాయానికి తాజాగా ఈయూ మంత్రులు వచ్చారు. 'ఈయూ, నాటోలను రష్యా పరీక్షిస్తోంది. మా స్పందన వేగంగా, దీటుగా, ఐక్యంగా ఉండాలి'అని ఈయూ రక్షణ కమిషనర్ అండ్రియస్ కుబిలియస్ పేర్కొన్నారు. ఈ చర్చల్లో 10 తూర్పు యూరప్ దేశాల మంత్రులతోపాటు ఉక్రెయిన్, నాటో అధికారులు పాలుపంచుకున్నారు. డ్రోన్ షీల్డ్‌ను పూర్తి చేసేందుకు కనీసం ఏడాది పట్టొచ్చని కుబిలియస్ చెప్పారు. 'సవివరమైన, సాంకేతికపరమైన రోడ్ మ్యాప్ రూపకల్పనకు ఆయా దేశాల రాయబారులు త్వరలోనే సమావేశమవుతారు. మా దృష్టంతా సమర్థవంతమైన ఉల్లంఘనల హెచ్చరికల వ్యవస్థను నెలకొల్పడంపైనే ఉంది'అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ ప్రతిపాదనపై వచ్చే వారం డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో జరిగే ఈయూ నేతల శిఖరాగ్రంలోనూ చర్చ జరుగుతుందన్నారు. అక్టోబర్ మరోసారి భేటీ అయ్యే ఈయూ రక్షణ మంత్రులు, తమ వెంట రక్షణ పరిశ్రమల ప్రతినిధులను కూడా తీసుకువస్తారని కుబిలియస్ వివరించారు. శుక్రవారం జరిగిన సమావేశం ఒక మైలురాయి వంటిదని అభివర్ణించారు. ఇప్పటి నుంచి అసలైన కార్యాచరణ మొదలవుతుందని వెల్లడించారు. ఫిన్లాండ్, ఎస్టోనియా, లాట్వియా, లిథువేనియా, పోలండ్ దేశాలు డ్రోన్ వాల్ ప్రాజెక్టుపై కొన్ని నెలలుగా పనిచేస్తున్నాయని ఈయూ రక్షణ కమిషనర్ ఆండ్రియస్ కుబిలియస్ పేర్కొన్నారు. డ్రోన్ షీల్డ్ ఏర్పాటుకు అవసరమైన నిధులు సమకూర్చాలంటూ మార్చిలో ఎస్టోనియా - లిథువేనియాలు చేసిన వినతిని ఈయూ పట్టించుకోలేదు. అయితే, ఈలోగా పరిస్థితులు మారాయి. గురు, శుక్రవారాల్లో డెన్మార్క్‌తో తమ సరిహద్దులకు సమీపంలో డ్రోన్ల సంచారాన్ని గుర్తించామని జర్మనీ పేర్కొంది. దీంతో, డ్రోన్ గోడ అవసరాన్ని అందరూ గుర్తించారని కుబిలియస్ తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీన పోలెండ్ గగనతలంలోకి ప్రవేశించిన రష్యా డ్రోన్లను కూల్చి వేసేందుకు నాటో యుద్ధవిమానాలు రంగంలోకి దిగాయి. కేవలం చిన్న బెదిరింపునకే ఖరీదైన ప్రతిచర్యకు దిగాల్సి వచ్చిందన్నారు. డ్రోన్ల సంచారం కనిపించడంతో ఇటీవల డెన్మార్క్‌లోని విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. రష్యాతో సరిహద్దులు పంచుకుంటున్న ఇతర దేశాల్లోనూ ఇలాంటి భయాలే నెలకొన్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు సైతం హైబ్రిడ్ యుద్ధం అనుభవాన్ని చవి చూస్తున్నాయని పోలెండ్ రక్షణ మంత్రి వ్లాడిస్లావ్ కోసినియక్-కమీజ్ అన్నారు. రష్యా నుంచి దీని తీవ్రంగా మరీ ఎక్కువగా ఉంది, వీటిపై సరైన రీతిలో స్పందించాల్సిన సమయం వచ్చిందని ఆయన తెలిపారు.

# వివక్షాపూరిత టారిఫ్‌లతో వాణిజ్యానికి విఘాతం

**ఐక్యరాజ్యసమితి /న్యూయార్క్:** విచక్షణారహితంగా టారిఫ్‌లను విధిస్తూ వాణిజ్య నియంత్రణ చర్యలకు పాల్పడటంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటువంటి నిర్బంధపూరిత విధానాలతో గ్లోబల్ సౌత్ దేశాలను అణగదొక్కే ప్రమాదముందని హెచ్చరించాయి. ప్రపంచ వాణిజ్యాన్ని మరింత తగ్గించి, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీసి, అంతర్జాతీయ ఆర్థికవాణిజ్య కార్యకలాపాలలో అనిశ్చితిని కల్పిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి రక్షణాత్మక చర్యలు ప్రస్తుత ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేయడంతోపాటు ప్రపంచ అభివృద్ధి అవకాశాలను ప్రభావితం చేస్తాయని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాలకు హాజరైన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు భారత్ అధ్యక్షతన శుక్రవారం న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టనుండటం తెల్సిందే. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అధ్యక్షతన భేటీ జరిగింది. అనంతరం మంత్రులు అమెరికా ప్రభుత్వం, అధ్యక్షుడు ట్రంప్ పేరును ప్రస్తావించకుండా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశం పహల్గాం ఉగ్రదాడిని కూడా ఖండించింది.



# గత ఏడాది అత్యంత క్లిష్టమైంది!



**లండన్:** తన జీవితంలో 2024 సంవత్సరం అత్యంత కఠినమైనదని ప్రిన్స్ విలియం వ్యాఖ్యానించారు. గత ఏడాది విలియం భార్య కేట్, ఆయన తండ్రి కింగ్ చార్లెస్-3 ఇద్దరూ క్యాన్సర్ చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే లెవీ నిర్వహిస్తున్న 'ది రెలుక్టెంట్ ట్రావెలర్' షోలో విలియం ఈ విషయాలు పంచుకున్నారు. 'షిట్స్ క్రీక్' నటుడు యూజీన్ లెవీ నిర్వహిస్తున్న ఆపిల్ టీవీ+ ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రివ్యూలో విలియం మాట్లాడుతూ.. '2024 నా జీవితంలోనే అత్యంత కఠినమైన సంవత్సరం అని నేను చెబుతాను. జీవితం మమ్మల్ని పరీక్షించాలని నిర్ణయించుకుంది.. ఆ పరీక్షను అధిగమించగలిగినప్పుడే మనమేమిటో తెలుస్తుంది.' అని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 3న ప్రసారం కానున్న ఈ ఎపిసోడ్ ప్రివ్యూలో విలియం.. లెవీని విండ్సర్ కోట చుట్టూ తిప్పుతూ చూపించడం, వారిద్దరూ ఒక పబ్‌లో బీరు పంచుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న దృశ్యాలున్నాయి. కేట్ జనవరిలో తనకు క్యాన్సర్ నయమైందని ప్రకటించారు. ఇటీవల ఆమె అనేక బహిరంగ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ నెల ప్రారంభంలో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూకే పర్యటనలో.. ఆయనకు రాజ మర్యాదలతో ఆహ్వానం పలకడంలో ఆమె, విలియం కీలక పాత్ర పోషించారు. కింగ్ చార్లెస్ కూడా గత సంవత్సరం చికిత్స కోసం నెలల పాటు విరామం తీసుకున్న తర్వాత దైనందిన జీవితంలో పాల్గొంటున్నారు. కానీ కింగ్ చార్లెస్-3, కేట్‌లు ఇద్దరూ తాము ఏ రకమైన క్యాన్సర్‌కు చికిత్స చేయించుకున్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

# గాజాలో 70 మంది పాలస్తీనియన్లు మృతి

## వైమానిక దాడులు, కాల్పులు ఆపని ఇజ్రాయెల్ ఆర్మీ

**డెయిర్ అల్-బలాహ్:** గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన వైమానిక దాడులు, కాల్పుల ఘటనల్లో కనీసం 70 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర, సెంట్రల్ గాజాపై శనివారం ఉదయం నుంచి ఈ దాడులు కొనసాగాయని అల్ జెజీరా తెలిపింది. మృతుల్లో కనీసం 36 మంది గాజా నగరంలోని వారేనని పేర్కొంది. నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని ఓ నివాసంపై జరిగిన దాడిలో కుటుంబంలోని 9 మంది చనిపోయారని అల్ ఔదా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గాజా నగరంలోని టుఫాలో జరిగిన మరో దాడిలో 11 మంది మృతి చెందారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులేనని అల్ అహ్లీ ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. షటి శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు షిఫా ఆస్పత్రి పేర్కొంది. గాజాలోని వేర్వేరు చోట్ల ఆహార పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో ఆరుగురు పాలస్తీనియన్లు మృత్యువాతపడ్డారు. గాజా నగరాన్ని పూర్తిగా ఆక్రమించుకునేందుకు భారీగా సైన్యాన్ని రంగంలోకి దించిన ఇజ్రాయెల్.. వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలంటూ ప్రజలకు హెచ్చరికలు కొనసాగిస్తోంది. దీంతో, ఇప్పటి వరకు 3 లక్షల మందికి పైగా నగరాన్ని విడిచి వెళ్లిపోగా, తాము ఎక్కడికి వెళ్లలేమంటూ మరో 7 లక్షల మంది భవనాల శిథిలాలు, టెంట్లలోనే ఉండిపోయారు. గడిచిన రెండు వారాల్లో ఇజ్రాయెల్ ఆర్మీ జరిపి వైమానిక దాడుల్లో రెండు క్లినిక్‌లు ధ్వంసమయ్యాయని



స్థానికులు తెలిపారు. ఔషధాలు, పరికరాలు, ఆహారం, ఇంధనం లేకపోవడంతో మరో రెండు ఆస్పత్రులను నిర్వాహకులు మూసివేయాల్సి వచ్చిందన్నారు. చాలా మంది పేషెంట్లు, సిబ్బంది ఆస్పత్రులను వదిలి వెళ్లిపోతున్నారు. చాలా తక్కువ సంఖ్యలో వైద్యులు, నర్సులు మాత్రమే కదల్లేని రోగులు, ఇంక్యుబేటర్లలో ఉంచిన చిన్నారులకు వైద్య సాయం అందిస్తున్నారు. ఇజ్రాయెల్ దాడులు తీవ్ర రూపం దాల్చడంతో తమ సేవలను నిలిపివేస్తున్నామని 'డాక్టర్స్ వితౌవుట్ బోర్డర్స్' గ్రూపు వైద్యులు శుక్రవారం ప్రకటించారు. గాజాలో హమాస్ లక్ష్యంగా చేపట్టిన తమ ఆపరేషన్ పని పూర్తయ్యాకే ఆగుతుందని ఐరాస జనరల్ అసెంబ్లీలో తోటి ప్రపంచ దేశాల నేతల సమక్షంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ దాడులు జరగడం గమనార్హం. 2023 అక్టోబర్ 7న హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రారంభించిన దాడుల్లో ఇప్పటి వరకు 65 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 1.67 లక్షల మంది గాయపడ్డారు. బాధితుల్లో సగానికి పైగా మహిళలు, చిన్నారులేనని గాజా ఆరోగ్య విభాగం చెబుతోంది.



# ది రాజా సాబ్ ట్రైలర్..
# ప్రభాస్ పోస్ట్ వైరల్

కల్కి సినిమా తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ చిత్రం కోసం అభిమానులు భారీగానే ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ గురించి ప్రకటన చేశారు. ప్రభాస్ రాయల్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నవారందరికీ శుభవార్త అంటూ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో ప్రభాస్ వింటేజ్ లుక్‌లో కనిపించారంటూ ప్రశంసలు దక్కాయి. 'ది రాజా సాబ్' ట్రైలర్ సెప్టెంబర్ 29న సాయింత్రం ఆరు గంటలకు విడుదల కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇదే విషయాన్ని ప్రభాస్ కూడా ప్రకటించారు. ఒక అభిమానిగా నా హీరోని ఎలా చూడాలనుకున్నానో ఆ విధంగానే ప్రభాస్‌ను చూపించానని మారుతి అన్నారు. దీంతో డార్లింగ్ ఫ్యాన్స్‌లో ఫుల్ జోష్ పెరిగింది. ఈ మూవీలో వచ్చే 40 నిమిషాల క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుందని కూడా దర్శకుడు చెప్పారు. ఈ చిత్రం సుమారు 3గంటల పాటు రన్ టైమ్ ఉంటుందన్నారు. దర్శకుడు మారుతి. ప్రభాస్ తొలిసారి ఈ సినిమా కోసం కలిసి పనిచేస్తున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీతో టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా డిసెంబరు 5న థియేటర్లలోకి రానుంది.

# సినిమా వాళ్లని జగన్ అవమానించలేదు

ఆర్. నారాయణమూర్తి



రీసెంట్‌గా అసెంబ్లీ సాక్షిగా నటుడు బాలకృష్ణ.. చిరంజీవిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై వెంటనే చిరంజీవి కూడా ఘాటుగా స్పందించారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో చిరంజీవి vs బాలకృష్ణ అన్నట్లు సాగుతోంది. ఇప్పుడు ఈ వివాదంపై ప్రముఖ నటుడు దర్శక నిర్మాత ఆర్. నారాయణమూర్తి స్పందించారు. గత ప్రభుత్వం.. సినిమా వాళ్లని అస్సలు అవమానించలేదని కుండబద్ధలు కొట్టారు. 'ఏపీ అసెంబ్లీలో బాలకృష్ణ కామెంట్స్‌పై చిరంజీవి స్పందన 100 శాతం నిజం. జగన్‌ని కలిసిన వాళ్లలో నేను కూడా ఉన్నాను. జగన్ గవర్నమెంట్ ఎవరినీ అవమానించలేదు. చిరంజీవి ఆధ్వర్యంలో మేము జగన్‌మోహన్‌రెడ్డి గారిని కలిసినప్పుడు ఆయన ఎంతో గౌరవం ఇచ్చారు. గత గవర్నమెంట్ చిరంజీవిగారిని అవమానించారనే ప్రచారం తప్పు. గత గవర్నమెంటు మా సినిమా వాళ్లని అవమానించలేదు. చిరంజీవి గారు నాకు స్వయంగా ఫోన్ చేశారు అది ఆయన సంస్కారం. అందరూ చిరంజీవి నివాసంలో కలిశాం. అనంతరం పరిశ్రమ పెద్దగా చిరంజీవి.. జగన్‌తో మాట్లాడారు' 'చిరంజీవి వల్లే ఆ రోజు సమస్య పరిష్కారం అయింది. ఇంకా ఇండస్ట్రీలో ఉన్న సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నాను. నేను బాలకృష్ణ గురించి మాట్లాడదల్చుకోలేదు. సినిమా టికెట్ ధరలు పెంచకూడదు. సామాన్యుడికి కూడా వినోదాన్ని పంచేది కేవలం సినిమా మాత్రమే. అలాంటి సినిమా టికెట్ ధరలు పెంచితే సామాన్యుడు ఇబ్బంది పడతాడు. ఆ రోజు మమ్మల్ని జగన్ ఎంతో గౌరవించారు' అని ఆర్.నారాయణ మూర్తి క్లారిటీ ఇచ్చారు.

# అనసూయ 3.ఓ..
## స్విమ్ సూట్ ఫోటోలు వైరల్



యాంకర్ అనసూయ కు సోషల్ మీడియాలో ఎంత ఫాలోయింగ్ ఉందో అందరికి తెలిసిందే. సినిమాల్లో కాకున్నా, సోషల్ మీడియాలో గ్లామరస్ పోస్టులు, వీడియోల ద్వారా మెరిపిస్తూ ఉంటుంది. తన దుస్తులు, వస్త్రధారణ విషయంలో వచ్చే విమర్శలకు ఘాటుగా బదులిస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది. అయితే తనపై ఎన్ని విమర్శలు వచ్చినా సరే.. తన ఎలా జీవించాలనుకుంటున్నానో..అలాగే జీవిస్తుంది. తన డ్రెస్సింగ్ కామెంట్స్ చేస్తే అస్సలు పట్టించుకోదు. ఇంకా చెప్పాలంటే.. గతం కంటే మరింత గ్లామర్‌గా రెడీ అయి ఫోటో షూట్ చేస్తోంది. తాజాగా అనసూయ తన ఇన్‌స్టాలో స్వీమ్ సూట్ ఫోటోలను షేర్ చేసింది. స్నేహితులతో కలిసి యూరప్ ట్రిప్ వేసిన అనసూయ.. ఐస్‌ల్యాండ్‌లో స్వీమ్ సూట్‌లో ఫోటోషూట్ చేసింది. బ్లాక్ స్విమ్ సూట్ ఫోటోలను ఇన్‌స్టాలో షేర్ చేయగా..అవి కాస్త వైరల్‌గా మారాయి. 'న్యూ వెర్షన్.. 3.ఓ', హాటీ అలర్ట్, వీకెండ్ బ్లాస్ట్' అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. కాగా, గతంలో కూడా అనసూయ బికీనీ, స్వీమ్ షూట్ ఫోటోలను షేర్ చేసింది. ఇక తన డ్రెస్సింగ్‌పై కామెంట్ చేస్తున్నవారిపై గతంలో అనసూయ తీవ్రంగా మండిపడ్డారు. 'నా భర్త, పిల్లలను నన్ను ప్రేమిస్తున్నారు. నేను ఏం చేసినా సపోర్ట్ చేస్తారు. వారెప్పుడు నన్ను జడ్జ్ చేయలేదు. బోల్డ్‌గా ఉండటమంటే అగౌరవంగా ప్రవర్తిస్తున్నట్టు కాదు. నేను ఇష్టపడే విధంగా దుస్తులు ధరిస్తున్నానంటే నేను నా విలువలను కోల్పోయానని కాదు. నన్ను ఆదర్శంగా తీసుకోమని ఎవరికి చెప్పడం లేదు. నాకు నచ్చినట్లుగా నేను బతుకున్నాను. మీకు నచ్చినట్లుగా మీరు బతకండి' అని అన్నారు.



# బాలీవుడ్ ఎంట్రీ

'హిట్ 2, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించి, స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు మీనాక్షీ చౌదరి. ఈ బ్యూటీ బాలీవుడ్ ఎంట్రీ ఖరారైందని సమాచారం. జాన్ అబ్రహం నటించనున్న హిందీ చిత్రం 'ఫోర్స్ 3'లోని హీరోయిన్ పాత్ర కోసం మీనాక్షీ చౌదరిని ఎంపిక చేసిందట యూనిట్. భావ్ దులియా దర్శకత్వం వహించనున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం షూటింగ్ ఈ నవంబరులో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో మీనాక్షి పాత్రకూ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని, ఇందుకోసం ఆమె శిక్షణ తీసుకోనున్నారని తెలిసింది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయని, కొన్ని వర్క్‌షాప్స్ కూడా జరుగుతున్నాయని భోగట్టా. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

# హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్..
# ఇప్పుడు మరో ప్రయత్నం



తెలుగు, తమిళంలో వరస సినిమాలు చేస్తూ బిజీగా ఉండే నటి వరలకిష్మ్ శరత్ కుమార్ ఇప్పుడు కొత్త జర్నీ మొదలు పెట్టింది. కెరీర్ ప్రారంభంలో హీరోయిన్.. రీసెంట్ టైంలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మూవీస్ చేస్తూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా దర్శకురాలిగా, నిర్మాతగా మారిపోయింది. ఈ మేరకు అధికారిక ప్రకటనతో పాటు కొత్త చిత్రాన్ని కూడా అనౌన్స్ చేసింది. తండ్రి శరత్ కుమార్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి వరలకీష్మ్.. 13 ఏళ్లుగా సినిమాలు చేస్తోంది. దక్షిణాదిలోని అన్ని బాషల్లోనూ నటించింది. ఈ ఏడాది నాలుగు చిత్రాలతో ప్రేక్షకులు ముందుకొచ్చింది. ఇప్పుడు సడన్‌గా 'సరస్వతి' అనే మూవీని ప్రకటించింది. ఈ మూవీకి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగానూ వరలకీష్మ్ వ్యవహరించనుంది. థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రంలో వరలకీష్మ్, ప్రియమణి, ప్రకాశ్ రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. తమన్ సంగీతమందిస్తున్నాడు. చెల్లి పూజతో కలిసి వరలకీష్మ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దోస డైరీస్ పేరుతో నిర్మాణ సంస్థని కూడా ప్రారంభించింది. గతేడాది నికోలాయ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్న ఈమె.. ఇప్పుడు దర్శకనిర్మాతగా ఎలాంటి ఫలితం అందుకుంటుందో చూడాలి? వచ్చే ఏడాది ఈ చిత్రం థియేటర్లలోకి రావొచ్చు.



# రజనీకాంత్‌పై రితికా సింగ్
# ఆసక్తికర వ్యాఖ్యలు

కొందరు కథానాయికలు సినిమాల్లో బాక్సింగ్‌లో దుమ్ము రేపి ఉండవచ్చు. అయితే నిజ జీవితంలోనే బాక్సింగ్‌లో అదరగొట్టిన నటి రితికాసింగ్. అవునుఉ రియల్ బాక్సర్‌గా బరిలో రఫ్ఫాడించి విన్నర్‌గానిలిచిన ఈ బ్యాఉటీ ఇరుదుచుట్ర చిత్రంతో రీల్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రం తమిళంలో మంచి విజయాన్ని సాధించడంతో తెలుగులోనూ రీమేక్ అయ్యి ఇక్కడి ప్రేక్షకులకు రితికా సింగ్‌ను పరిచయం చేసింది. ఆ తర్వాత ఈ ఉత్తారణి జాణ వరుసగా తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాలు చేసుకుంటూ పోతున్నారు. ఇటీవల వేట్టయాన్ చిత్రంలో రజనీకాంత్‌తో కలిసి పోలీస్ అధికారిగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ భామ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తమిళ చిత్ర పరిశ్రమలో ఒక్కో నటుడు ఒక్కో విధంగా మానవత్వంతో ప్రశాశిస్తున్నవారేనన్నారు. అలాంటి వారితో నటించిన తరుణాలు తన మనసులో ఎప్పటికీ పదిలమేనన్నారు. అలాంటి వారిలో ఒక్కరిని ఎంపిక చేయాలంటే అది రజనీకాంత్ నే అన్నారు. ఆయన ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా..ఇతరులపై చూపించే ప్రేమాభిమానాలు ఎపప్పుడూ ఆశ్చర్యానికి గురి చేస్తాయన్నారు. మహిళలపై అత్యాచారాలంటేనే తనలో కోపం కట్టలు తెంచుకుంటుదన్నారు. మిమ్మల్ని ఎవరైనా సైట్ కొడితే ఏం చేస్తారు అన్న ప్రశ్నకు కొంచెం పక్కకు రమ్మంటానని, ధైర్యం ఉంటే అలాంటోడిని రమ్మనండి చూద్దాం అని సవాల్ చేశారు. వైవిధ్యమైన కథా పాత్రల్లో నటించాలని ఆశిస్తున్నట్లు రితికాసింగ్ తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com